ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఏప్రిల్ 26, 2015



దర్శక నిఘంటువు
దాసరి



వినిపించని విషాదం

పెళ్లి అడ్డు కాదు

కళ్లతోనే హావభావాలు పలికించగలిగే నటుల్లో జ్యోతిక ఒకరు. సినీ కెరీర్‌లో తారాపథాన ఉన్నప్పుడే విలక్షణ నటుడు సూర్యను పెళ్లి చేసుకుని స్థిరపడింది. అతనికి సమానమైన ఇమేజ్ ఉన్నా కుటుంబానికే అంకితమైంది. సరైన వయసులో పెళ్లి చేసుకుని, వెంటనే బిడ్డలకు జన్మనిచ్చి కుటుంబ జీవితమే ముఖ్యమని చాటింది. చాన్నాళ్ల తర్వాత ఆమె ఇపుడు ఓ ప్రాజెక్టులో మళ్లీ నటిస్తోంది. సూర్య నిర్మాతగా వ్యవహరిస్తున్న '36 వయదినిలే' చిత్రంలో తన పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. 'హౌ ఓల్డ్ ఆర్ యూ' అనే మళయాలీ చిత్రానికి ఇది రీమేక్. కుటుంబ జీవితానికే అంకితమైన ఓ మహిళకు పెళ్లితో జీవితం ముగిసినట్టు కాదన్న కోణంలో నడుస్తుంది కథనం. చాలామంది వివాహితలు వాళ్ల భర్తల కన్నా ఎక్కువ క్వాలిఫికేషన్ కలిగి ఉంటారు. పెళ్లాయ్యాక పూర్తిగా కుటుంబానికి అంకితమవడంలో తమను తాము మరచిపోతారు. వాళ్ల గురించి కూడా కాస్త ఆలోచించుకోవాలన్నదే చిత్ర సందేశమని వివరించిన జ్యోతికకు కెరీర్, కుటుంబం విషయంలో చాలా స్పష్టత ఉంది. వృత్తికే అంకితమై పిల్లలు ఏమవుతున్నారనే విషయాన్నే పట్టించుకోనివారికి తాను వ్యతిరేకమని, పిల్లలకే తొలి ప్రాధాన్యమని, ఆ తర్వాతే సినిమాలని తేల్చిచెప్పింది. తను ఏడేళ్ల కూతురు దియా, ఐదేళ్ల కొడుకు దేవ్‌ల నడతను జాగ్రత్తగా తీర్చిదిద్దుతోంది. ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకోవడానికి రెండు రోజులు ఆలోచించానని, సూర్య చొరవతో ఓకే చెప్పానని వివరించింది. కుటుంబ జీవితం మీద కెరీర్ ప్రభావం పడకుండా సూర్య

కూడా జాగ్రత్తలు తీసుకుంటాడనీ... వారాంతపు సెలవుతో పాటు, రోజూ సాయంత్రానికల్లా షూటింగ్ పూర్తయ్యేలా ఏర్పాట్లు చేయడంతో ఇబ్బంది కలగడం లేదని తెలిపింది. ●

కొత్త అవతారం

అందంతో పాటు తెలివి కలగలసిన బాలీవుడ్ సొగసరి ఎవరంటే సొట్టబుగ్గల సుందరి ప్రీతిజింటా టక్కున గుర్తొచ్చేస్తుంది. నటిగా, నిర్మాతగా, క్రికెట్ జట్టు సహ యజమానిగా భిన్న పాత్రల్ని విజయవంతంగా పోషించిన ప్రీతి ఇప్పుడు ఓ డ్యాన్స్ షోకు జడ్జిగా కొత్త అవతారం ఎత్తబోతోంది. ఈ మధ్యే రియాల్టీ డ్యాన్స్ షో 'నాచే బలియే'కు జడ్జి పాత్ర పోషించేందుకు అంగీకరించింది. ఏక్తా కపూర్ సారథ్యంలో బాగా పాపులరైన ఈ షోకు తన గ్లామర్‌తోపాటు, అనుభవాన్ని, తెలివిని రంగరించి మరింత వన్నె తెస్తానని కాన్ఫిడెంట్‌గా చెబుతోంది. మళ్లీ గ్లామర్ ప్రపంచానికి తిరిగొచ్చిన నలభై ఏళ్ల అందాల రాశి సన్నీ డియోల్‌తో కలసి 'భయ్యాజీ సూపర్ హిట్' అనే చిత్రంలోను నటిస్తోంది. ఈ సారి వీలైనన్ని ఎక్కువ సినీ ప్రాజెక్టులను చేస్తానని అభిమానులకు మాటిచ్చింది.

ఇంతకాలం పూర్తిగా ఐపీఎల్‌కే అంకితమైన ప్రీతి, జట్టును ముందుండి నడిపి మంచి నాయకురాలిగా కూడా గుర్తింపు పొందింది. అయితే, ఈ ఐపీఎల్ సీజన్లో బొత్తిగా కనిపించడం లేదే అని అడిగితే "జట్టు లాభాల్లోకి వచ్చింది. జట్టు, వ్యాపారం బాగానే నడుస్తున్నాయి. ఇప్పుడు నా ప్రమేయం, అవసరం లేవు. ఇప్పుడు కేవలం ఒక ప్రేక్షకురాలిగా ఆటను ఆస్వాదిస్తాను" అని బదులిచ్చింది.

గతేడాది అమెరికాలో ఎన్నో షోలు, కార్యక్రమాలు నిర్వహించిన ప్రీతికి అక్కడ కొందరు ప్రత్యేకమైన వ్యక్తులు పరిచయమయ్యారట. కొన్ని విలక్షణమైన ప్రాజెక్టులు వారి ద్వారా తెలియవచ్చాయని చెప్పిన ప్రీతి త్వరలోనే భారత్‌లో తన ద్వారా వాటిని ప్రారంభిస్తానని బయటపెట్టింది. అంతగా ప్రీతిని ఆకట్టుకున్న అవేంటో తెలుసుకోవాలంటే మాత్రం కొన్నిరోజులు వేచిచూడాలని చల్లగా సెలవిచ్చింది. ఈ తెలివైన అమ్మడిని ఆకట్టుకున్నాయంటే కచ్చితంగా అవి లాభాల్ని తెచ్చిపెట్టేవే. ఇంతకీ అవి కళకు సంబంధించినవా కాదా అనేది తోటి తారల సందేహం. ●

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

కట్...కట్...

ఇవాళ ప్రతి ఒక్కడికీ కత్తెరతోనే పని. అసలు ప్రపంచం అంతా కత్తెర మీదే నడుస్తోందా అన్న అనుమానం లాంటి సందేహం కలిగినా ఆశ్చర్యం లేదు. మరి కత్తెర లేనిదే క్షణం నడవడం లేదు. ఎవరిని చూసినా కత్తెర కోసం చెయ్యి చాచేవాళ్లే. కత్తిరించేవాళ్లే. కాకపోతే ఒక్కొక్కరిది ఒక్కో స్టయిల్.

క్రాఫింగు చేసేవారి సంగతి సరేసరి. వారి ప్రధాన పనిముట్టు కత్తెరే. కొనవేళ్లతో కేశాల కొసలు పట్టుకుని టకటకా కత్తిరించేస్తారు. క్షణాల్లో గడ్డివాము లాంటి తలను ... సాళ్లు తీసిన పంటచేనులా అందంగా తీర్చిదిద్దేస్తారు. ఎన్ని రకాల క్రాఫింగులనైనా చిటికెలో చేసేసి అద్దం ముందు పెట్టేస్తారు.

చోటామోటా చోరులకు బ్లేళ్లూ, కత్తెరలూ కవల పిల్లలతో సమానం. అవి లేకపోతే అస్సలు తోచదట వారికి. మరి ఫుడ్డు పెట్టేది అవే కదా. వాటిమీద ఆ మాత్రం ఆపేక్ష వుండడంలో తప్పలేదు. కాకపోతే కత్తెర వేయబోయి దొరికిపోతేనే ... కుళ్లబొడిచేస్తారు జనం.

గుండెలు మార్చాలన్నా, గుండీ కుట్టాలన్నా కత్తెర వుండాల్సిందే. డాక్టర్లూ, టైలర్లూ టేపుతో కొలతలు వేసి మరీ పని పూర్తి చేసేస్తుంటారు. ఒకరు గుడ్డలు కత్తిరిస్తే... మరొకరు చర్మం కట్ చేస్తారు. దర్జీ సాబ్ అందమైన బట్టలు కుట్టడానికి కత్తెర వాడితే... డాక్టర్ సాబ్ ఆరోగ్యాన్ని కాపాడ్డానికి సిజర్స్ వాడేస్తారు.

ఈ మధ్య సినీస్టార్లూ కత్తెర వాడేస్తున్నారు. మరీ ముఖ్యంగా హీరోయిన్లు. చేతిలో పెద్దగా సినిమాల్లేని అమ్మళ్లు కూడా బట్టల దుకాణాలు, నగల షాపుల ... రిబ్బన్ కత్తిరించేసి యమ బిజీగా వున్నట్టు బిల్డప్పిచ్చేస్తున్నారు. అలాగైనా పత్రికల్లో ఫొటోలు పడతాయని ...సినిమాల్లో అవకాశాలొస్తాయని... ఆశ.

డైరెక్టర్ సార్లు... స్టార్ట్ ...యాక్షన్ చెప్పడమే కాదు. సీన్ పండినా ... పచ్చడైనా చెప్పే మాట ఒకటే. 'కట్...కట్..'. కాకపోతే వీరికి కత్తెరతో పని లేదు. నోటితోనే పని. సినిమాల ఎడిటర్లు మాత్రం కత్తెర్లకు ఫుల్లు పని పెట్టేస్తారు. లేకపోతే నిర్మాత జీవితం కత్తెరైపోతుంది మరి. పత్రికాఫీసుల్లో నిన్న మొన్న చేరిన సబ్ ఎడిటర్ నుంచి ఎడిటర్ల వరకు అందరికీ కత్తెరతోనే పని.కత్తెర సైజులోనే తేడా వుంటుంది.

అన్నట్టు స్కూళ్లు, కాలేజీల్లో మాస్టార్లు, లెక్చరర్లు కూడా కత్తెర్లు వాడుతుంటారు. వారు వాడే కత్తెర కనిపించదు. తెగిపోయిన తోకలు (పోకిరీ విద్యార్థులవి) మాత్రమే నేలమీద పడి కొట్టుకుంటూ కనిపిస్తాయి.

సెన్సార్ బోర్డు సభ్యుల దగ్గర కూడా మాంచి కత్తెర్లే వుంటాయి. అసభ్యకరమైన సన్నివేశాలు, అభ్యంతరకర భావజాలం వుంటే కత్తిరించేయడమే వారి పని. ఈ మధ్య వస్తున్న సినిమాలు చూస్తుంటే ... 'అసలు సెన్సారు బోర్డు సభ్యులు కత్తెరను వాడుతున్నారా?' అన్న అనుమానం వస్తోంది. తారల బట్టలు, వారి నోటెంట వినిపించే ద్వంద్వార్థపు డైలాగులు అలా వుంటున్నాయి మరి.

ఇక మన లీడర్లు ...! వీరి చేతుల్లో ఈ మధ్య పదునైన కత్తెర్లు తళతళలాడుతూ కనిపిస్తున్నాయ్. ఖర్చుల తగ్గింపు పేర సంక్షేమ పథకాలు, పొదుపు పేర ఉద్యోగుల సంఖ్యనూ, వికేంద్రీకరణ పేర అధికారాలనూ చడా మడా కత్తిరించి పారేస్తున్నారు. కానీ వీరు ఒక్క విషయం మర్చిపోతున్నారు. ప్రజల చేతుల్లో మాస్టర్ కత్తెర వుంటుందనీ! వారు కానీ కత్తెర వేస్తే అధఃపాతాళం లోకి జారిపోతారనీ! ■

◆ మనలో మాట

టపా

అనుబంధం బాగుంది

స్వచ్ఛ భారత్ గురించి కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి సెలబ్రిటీలతో ప్రచారం చేయిస్తోంది ప్రభుత్వం. ప్రచారం కోసం సెలబ్రిటీలకు వెచ్చించే డబ్బులు వర్కర్లకి ప్రతి నెల ఇచ్చి క్రమపద్ధతిగా చేయిస్తే అంతా స్వచ్ఛంగా ఉంటుంది. అందుకు మహారాష్ట్రలోని తమ్నాథ్ గ్రామమే సాక్ష్యం.కూతుర్ని సాకడం కోసం నలభ య్యేళ్లుగా మగాడిలా బతికిన సీసా లాంటి స్త్రీ మూర్తికి అరుదైన గౌరవం దక్కాలి. డాలి ప్రతిభ మరింత ఇనుమడించాలని కోరుకుంటున్నాను. డాలి పాపకు అభినందనలు. ఆడపిల్ల పుడితే మొక్కలు నాటుతున్నారు పిప్లాంత్రి గ్రామస్తులు. వారిని ఎంతో అభినందించాలి. ప్రకృతి మనుగడకు మొక్కలు మూలం. అందుకే స్త్రీ జాతిని, వృక్షజాతిని ఎల్లప్పుడూ కాపాడుకోవాలి. అమర చిత్ర యాత్ర సినిమాల గురించి చెప్పాలంటే చిత్ర విచిత్రాలున్నదే సినిమా.ఎన్నో వింతలు విడ్డూరాలు ఉంటాయి. సినిమా వాళ్ళు అందాలతో పాటు కొత్త ప్రకృతి ప్రాంతాలను ప్రజలకు పరిచయం చేస్తారు. రంగుల పేజీల్లో ఇచ్చిన పూల చిత్రాలు చాలా బాగున్నాయి. వాటితో చేసిన కళాఖండాలను చూస్తే అబ్బురమనిపించింది.

కనకలక్ష్మి, పూజారిపేట, ఆమదాలవలస.

'నకిలీ' నచ్చింది

'నకిలీ'లపై ఇచ్చిన మనలో మాట వాస్తవానికి అద్దం పట్టింది. నకిలీ కరెన్సీ దగ్గర నుండి వస్తువులు, చిత్రాలు, నకిలీ వైద్యులు, నకిలీబాబాలు మాత్రమే కాదు. నకిలీ పోలీసులు ఐ.ఎ.ఎస్, ఐ.పి.ఎస్ అధికారులు తహశీల్దార్లు, కలెక్టర్లు సైతం ఈ మధ్య హల్‌చల్ చేశారు. ఒక నకిలీ ఐ.పి.ఎస్ అధికారి మానవ హక్కుల కమిషనర్‌గా వచ్చాడు. హోం మంత్రికి బంధువునని చెప్పుకున్నాడు. ఫోటోలు చూపించాడు. మంత్రిగారు తనకు తెలీదని చెప్పారు. ఇదో పెద్ద కథనుకోండి. నకిలీ ఎన్‌కౌంటర్లు నాలుగు దశాబ్దాలుగా జరుగుతున్నాయి. అలాగే లాకప్ డెత్‌లు అవుతున్నాయి. మూడు అడుగుల ఎత్తున్న కిటికీకి ఉరివేసుకొన్నాడని పోలీస్ కథనాలున్నాయి. మొత్తం మీద 'నకిలీ' చదివించింది.

టి. శ్రీరామ మూర్తి, గాజువాక, విశాఖ.

హాయిగా చదివాం

నా కథ అంటూ వైజాగ్ గురించి చదువుతుంటే ఎంతో హాయిగా ఉంది. అచ్చం అద్దం లాంటి ఊరు చాలా బాగుంది. ఆకాశమంత ఆశయం ముందు హిమాలయ శిఖరాల ఎత్తెంత? మనిషి గమ్యానికి ఎవరూ అడ్డుకాదని మరో సారి నిరూపించారు. మన మస్తాన్‌బాబు ఆశయం ముందు పర్వతాలే చిన్నబోయాయి. ఆ పర్వతాలకే తన జీవితం అర్పించడం చాలా బాధాకరమైన విషయం. మనిషి సాధించలేనిది ఏమీ లేదని మరోసారి నిరూపించిన మస్తాన్‌ను మనసారా అభినందించని వారుంటారా?

- స్వాములు, కర్నూలు.

అన్వేషణ ఫలించాలి!

అపహరణకు గురైన తన కొడుకు కోసం చైనా తండ్రి అన్వేషణ ఆకట్టుకుంది. అతను విరామం లేకుండా దేశమంతటా వెతుకుతున్నాడు. కుమారుడి మీద అతనికున్న ప్రేమే ఎంతటి శ్రమనైనా చేయిస్తోంది. తండ్రీకొడుకులు తిరిగి కలుసుకోవాలని ఆశిద్దాం.

నేమాన సుభాష్ చంద్రబోస్, విశాఖపట్నం (ఈ మెయిల్).

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 21/1, ఆజామాబాద్, హైదరాబాద్-500020.

మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

వినిపించని విలాపం

కవర్‌స్టోరీ 14

చివికిపోయిన తెల్లచీరల్లో బక్కపల్చటి దేహాలు... వంగిన వెన్ను. శూన్యంగా చూసే నిర్వికార నయనాలు... తడబడే అడుగులు... గుడి మెట్ల దగ్గర చాచిన చేతులు... పట్టెడు మెతుకుల కోసం గంటల తరబడి దైవ జపం చేసే జీవం లేని పెదాలు...! ఇలాంటి వారు వేలాదిగా కనిపించే నగరాలు రెండు... బృందావన్, వారణాసి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలుగా... వితంతు నగరాలుగా పేరుబడిపోయిన ఈ జంట నగరాల్లో ఎక్కడ చూసినా వీరే. ఆశ్రమాలు, ఆలయాలు, ఘాట్‌లు, వీధుల్లో... ఎక్కడ కాస్త జాగా దొరికినా నిశ్శబ్దంగా సర్దుకుపోతారు. వీళ్లు వయోవృద్ధులేమీ కాదు. అక్కడ ఆఖరి శ్వాస విడిచి ఇహలోక బంధాల నుంచి విముక్తి పొందాలని ఆరాటపడే ఏకాకులు.

సందర్భం 3
ఫ్రాన్స్ అందెల సవ్వడి

తెలుసా? 4

వింతలోకం 5
బక్క పల్చటి ఇల్లు

కథ 6
మధురం

స్ఫూర్తి 8
ఉద్యోగం వికలాంగులకు మాత్రమే

స్టార్ 9
ఆ ప్రేమతో.. నన్ను నేను మర్చిపోతా

సినిమా కబుర్లు 10
దర్శక నిఘంటువు దాసరి!

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
పాలక్ రైస్

బాలనేస్తాలు 22
కోతి పాట్లు

నవ్వుల్-పువ్వుల్ 24

'పద్మ' పరిమళాలు 12



◆ సందర్భం

ఆమె బొమ్మలా ఉంటుంది. కానీ, క్లిష్టమైన కథాకళి హావభావాలను మోముతో పలికించగలదు. ఆమె పాశ్చాత్యురాలు. కానీ, సంక్లిష్టమైన భరతనాట్య మెలకువలను మేనితో కదిలించగలదు. మరియం సోఫియాగా మనింట పాదం మోపి, పారిస్ లక్ష్మిగా మన ముంగిట గజ్జె కట్టి నర్తిస్తోందీ ఫ్రెంచ్ నాట్యకారిణి. ఆమె నాట్యం కోసమే పుట్టింది. నాట్యంలోనే జీవిస్తోంది. బాలే, కాన్‌టెంపరరీ (సమకాలీన నృత్యం), జాజ్, ఫ్లామెన్‌కో, హిప్‌హాప్ వంటి పాశ్చాత్య నృత్యరీతుల్లోనూ ఆమెది మనసును కదిలించేంతటి నైపుణ్యం. ప్రపంచ నాట్యానికి చిహ్నం మరియం. ఫ్రాన్స్ నుంచి కేరళ చేరిన ఆమె నాట్య విశేషాల గురించి, అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా...

ఫ్రాన్స్ అందెల సవ్వడి

ఫ్రాన్స్‌లోని ఎయిక్స్ ఎన్ ప్రావిన్స్‌కు చెందిన మరియం తప్పటడుగులు వేసేప్పుడే డ్యాన్స్ మూవ్‌లు చేస్తుండేది. ఐదవ యేటే కాంటెంపరరీ డాన్స్ పోటీలో పాల్గొంది. ఆ తర్వాత విభిన్న రీతుల్లో శిక్షణ పొంది సత్తా చాటింది. ఆమె దక్షిణ ఫ్రాన్స్‌లో 1991 జులై 16న జన్మించింది. ఆమె తండ్రి ఎవెస్ క్వినియో. ఆయన నాటక కళాకారుడు. ఆమె తల్లి ప్యాట్రిసియా క్వినియో శిల్పి. ఆమె తన కుటుంబంతో ప్రతి ఏటా సెలవుల్లో భారత్‌కు వచ్చేది. శాస్త్రీయ నృత్య ప్రదర్శనలకు హాజరయ్యేది. మన నృత్య శైలులతో ప్రేమలో పడిన ఆమె వాటిని నేర్చుకోవాలని తపన పడింది. వి.యస్. ముత్తుస్వామి పిళ్ళై, సుచేతా చాపేకర్‌ల శిష్యురాలైన ఫ్రెంచ్ నాట్యకారిణి ఆర్‌మెల్లీ చోఖార్ట్‌ను కలిసి ఆమె దగ్గర తొమ్మిదవ యేట నుంచే భరతనాట్యంలో శిక్షణ తీసుకుంది. వి.ఎస్. ముత్తుస్వామి పిళ్ళై, పద్మా సుబ్రహ్మణ్యంల శిష్యుడైన డామినిక్ టెలోర్స్ వద్ద కొంతకాలం శిక్షణ పొందింది. తర్వాత పూణెలోని సుచేతా చాపేకర్ వద్ద కొంతకాలం, చెన్నైలోని డాక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం నృత్యోదయ నాట్య విద్యాలయంలో కొన్ని నెలలు శిక్షణ పొందింది.

ఘల్లు, ఘల్లుమని..

భారత్‌లో తొలిసారిగా 19వ యేట వాయ్‌కోమ్ మహాదేవ ఆలయంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఇచ్చింది. అప్పటి నుంచి ఆమె అందియల సవ్వడి ఎన్నో నాట్య వేదికల్ని దాసోహం చేసుకుంది. గతేడాది కేరళ కళామండలంలో ఇచ్చిన ప్రదర్శనను ప్రసిద్ధ కథాకళి నాట్యకారుడు పద్మశ్రీ గోపి ఆసన్ తిలకించారు. అర్ధ భాగం నుంచే చూసినా ఆయన మరియం నాట్యానికి ముగ్ధులై ఆమెను ప్రత్యేకంగా కలిసి పొన్నాడతో గౌరవించి ఆమె నైపుణ్యాన్ని కొనియాడారు. అది ఆమెకు దక్కిన అరుదైన గౌరవమని ఆమె చెబుతూ ఉంటుంది. ప్రదర్శనల కోసం తనకంటూ ఓ రంగస్థల నామం ఉండాలని భావించిన మరియం 'లక్ష్మి'కి తోడుగా మరో పదం జోడిస్తే బాగుంటుందని అనుకుంది. మరియం సోదరుని మృదంగం గురువైన తిరువారూర్ భక్తవత్సలం దానికి ప్యారిస్ జోడించి ప్యారిస్ లక్ష్మిగా పిలవడంతో అదే స్థిరపడి పోయింది.మన మూలాలు, వారసత్వ సంపదైన శాస్త్రీయ కళల్ని భద్రపరచాలని, వాటి పవిత్రతను నిలబెట్టాలని పారిస్ లక్ష్మి బలంగా కోరుకుం టోంది. ప్రతీ కళాకారుడికీ తనదంటూ ఓ శైలి ఉంటుందని, తద్వారా నాట్యరీతులన్నీ ఎప్పటి కప్పుడు క్రమ వికాసం పొందుతాయని ఆమె అంటుంది. ప్రేక్షకులు కూడా వీటిని ఆహ్వాని స్తారని, అభిమానిస్తారని చెబుతోంది. నాట్యాన్ని కేవలం సినిమా, టీవీ, ఇంటర్నెట్ వంటి తెరలపై కాకుండా నేరుగా ప్రదర్శన తిలకిస్తే రసాను భూతి పొందుతారని అంటోంది. నృత్యరూపకం లోని జీవకళను ఆస్వాదించగలు గుతారని ఆమె చెబుతారు. ప్రేక్షకుల సందడి మధ్య ప్రదర్శనివ్వడం, వారి స్పందనను అనుభవించ డమే ఏ కళాకారుడైనా కోరుకునేదని అంటారు.

వెండితెరలో మెరిసి..

అమల్ నీరద్, అమితాబ్ బచ్చన్ టీమ్ నుంచి బాలతో ఒక చిన్న షాట్‌లో నటించే అవకాశం ఆమెను వెతుక్కుంటూ వచ్చింది. ఆమె ప్రతిభకు ముగ్ధుడైన అమల్ 'ఓ జాన్యువరి...' అనే పాటను ఆమెపై దృశ్యరూపకంగా చిత్రించారు. అంజలీ మీనన్ చిత్రిస్తున్న 'బెంగళూర్ డేస్'లో మిషెల్లె పాత్రకు సరిగ్గా సరిపోతుందని గుర్తించిన ఆయన మరియంను ఆ పాత్ర చేసేలా ఒప్పించారు. చిత్రంలో మిషెల్లె ఒక విదేశీ వనిత. శాస్త్రీయ నృత్యం నేర్చుకోవటానికి భారతదేశం వస్తుంది. విశేషమేమంటే, మరియంలానే ఆ పాత్ర తన భర్తను 'చెట్ట' అనే పిలుస్తుంది. ఆమెకు మళయాళం వచ్చు.

తకథిమి.. తకథిమి..

కేరళలో స్థిరపడి 'కళాశక్తి' పేరుతో ఓ నాట్య శిక్షణా కేంద్రాన్ని భర్త పల్లిప్పురమ్ సునీల్‌తో కలిసి ఆమె నడుపుతోంది. సునీల్ వాయ్‌కోమ్‌లో కథాకళి నృత్యకళాకారుడు. ప్రస్తుతం కొచ్చిలో చిన్నారులకు బ్యాలెట్ వర్క్‌షాపుకు ఆమె ఏర్పాట్లు చేస్తున్నారు. లక్ష్మి దృష్టిలో నాట్యానికి ఎటువంటి ఎల్లలు లేవు. ప్యారిస్ లక్ష్మి భరతనాట్యం నేర్పిస్తే, భర్త కథాకళి పాఠాలు బోధిస్తారు. విద్యార్థులకు అనువుగా నెలవారీ కోర్సులను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆమె ప్రస్తుతం భర్తతో కలసి 'కృష్ణమయం' అనే యుగళగీతిక దర్శకత్వ పనిలో నిమగ్నమై ఉంది.

- సింహాద్రి నాగశిరీష

తెలుసా?

❑ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను విండ్ స్క్రీన్ వైపర్లును లేజర్ ప్రింటర్లను కనిపెట్టిందెవరో తెలుసా స్త్రీ.

❑ పీడ కలలు రాకుండా ఉండేందుకు నల్లటి పిడిఉన్న కత్తిని తలగడ కింద పెట్టుకుని నిద్రపోయేవారు గ్రీకు వాసులు.

❑ భూమిపై విడుదలయ్యే ఆక్సిజన్లో ఎక్కువ భాగం ఆల్గే నీటి మొక్కల నుంచి వస్తున్నదే.

❑ మన శరీరంలో అదనంగా ఒక పౌండు కొవ్వు చేరిన ప్రతిసారీ శరీరం ఏడు మైళ్ల కొత్త రక్తనాళాలను తయారు చేస్తుంది.

❑ ఆస్ట్రేలియన్లు తమకు నచ్చని రాజకీయ నాయకుల పేర్లను హరికేన్ తుపాన్లకు పెడుతుంటారు.

❑ రైట్ బ్రదర్స్‌లో ఒకరైన ఆర్విల్లేకి ఓ విచిత్రమైన అలవాటు ఉండేది. కోడి గుడ్డు పెట్టినప్పుడల్లా గుడ్డు మీద నెంబర్లు వేసేవాడు. వాటిని ఆ వరసలో మాత్రమే తినేవాడు.

❑ ఎవ్రీ డాగ్ హాజ్ ఇట్స్ డేకేర్ అనేది కాలిఫోర్నియాలోని ఓ కుక్కల సంరక్షణ కేంద్రం పేరు.

❑ ఒక ఆస్కార్ ప్రతిమను తయారు చేయడానికి పది మంది మనుషులు కలిసి సుమారు అయిదున్నర గంటలు కష్టపడతారు. ప్రతిమను పాలిష్ చేయడానికి గంట పడుతుంది.

❑ సిగరెట్టును కనుక్కోక ముందే లైటర్‌ను కనుగొన్నారు.

❑ ఏటా ప్రపంచ వ్యాప్తంగా 3500 కోట్ల గ్యాలన్లకు పైగా బీరు అమ్ముడవుతోంది. వాటర్ బాటిళ్ల విషయానికొస్తే వాటి సంఖ్య 4600 కోట్ల గ్యాలన్లకు పైనే.

❑ మానవ శరీరంలో మనిషి మెదడు రెండు శాతం మాత్రమే. కాని రక్తం, ఆక్సిజన్ వాడకంలో దాని వాటా 20 శాతం.

❑ 1993 రష్యాలో 'బీర్ లవర్స్' అనే రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. జాతి, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా బీరు తాగేవాళ్ళ హక్కులను పరిరక్షించడమే దాని ధ్యేయమట. అయితే ఆ పార్టీ 1998లో కనుమరుగైంది.

బుడ్డి డీజే

బుద్ధిగా చదువు చెప్పే యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటాడని ముచ్చట పడి ఈ బుడ్డోడికి ఐప్యాడ్ కొనిస్తే, వీడేమో ఎంచక్కా పాటల్ని కిర్రెక్కించే డీజే యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అక్కడితో ఆగకుండా బాగా చేయి తిప్పే డీజేగా మారి ప్రదర్శనలు ఇచ్చేస్తున్నాడు. ఇంతకీ వీడి వయసెంతా అంటే రెండేళ్లే. పూర్తిగా మాటలు కూడా రాని వోరటిల్వే హ్లోంగ్వానే డీజే ఏజేగా దక్షిణాఫ్రికాను ఓ ఊపు ఊపేస్తున్నాడు. డీజే కన్‌సోల్‌తో ఓ ఆట ఆడకుంటూ హెవీ బేస్ హౌజ్ పాటల హోరులో ముంచేస్తున్నాడు. చదువు సంగతి ఎలా ఉన్నా తమ కొడుక్కి దేశం నిండా అభిమానులు నిండడంతో ఉబ్బితబ్బిబ్బై పోతున్నారు తల్లిదండ్రులు గ్లెన్ హోంగ్వానే, రెఫీలోయ్ మారుమో. అంత చిన్న వయసులో ఎంత వేగంగా టెక్నాలజీని వడిసిపట్టాడీ బుడతడని ఆశ్చర్య పోతున్నారు.

'ఆవిరి' పట్టాడు

ఆవిరి రైళ్ల కాలం మర్చిపోయి బుల్లెట్ రైళ్లు పరుగందుకుంటున్న రోజులివి. మోటార్ బైక్ అంటే గాల్లో కూడా ఎగరాలని కలలు కంటున్న కాలమిది. అయితే, 'బ్లాక్ పెరల్'గా దుగ్‌దుగ్‌మంటూ నడుస్తున్న ఈ బైకును చూస్తే అది కలేమోనని గిల్లుకుంటారు. పెట్రోలు, ఎలిక్ట్రిక్ శక్తితో నడిచే బైకుల్ని తప్ప మిగతా వాటిని మనం ఊహించుకోలేం. కానీ, ఇలాంటి ఊహను నిజం చేసుకున్నాడు డచ్ బైక్ తయారీదారు రెనె వాన్ టులి. ఆవిరి యంత్రంలోని టెక్నిక్‌ను పట్టి బైక్‌కు కిక్ కొట్టించాడు. చూడ్డానికి భారీగానే ఉన్నా ఇది కదిలేది మాత్రం గంటకు 8 కిలోమీటర్ల వేగంతోనే. అంత నిదానంగా నడిచేది ఎవరికి కావాలి అంటే, మాంచి సీనరీలున్న ప్రదేశాల్లో చివరి బైక్ మనదైతే ఆ కిక్కే వేరప్పా అంటున్నాడు.

బక్కపల్చటి ఇల్లు

మనిషన్నాక కాసింత కళాపోషణ ఉండాలి, ఆరడుగుల చోటుండాలి అన్నారు. వీళ్లకు ఇది ఎలా అర్థమైందో కానీ, మూడు అడుగుల వెడల్పుతో కళను అద్ది ఇల్లు కట్టి నిలబెట్టారు. ఒక్కరికిది బాగా సరిపోతుందని చెప్తున్నారు. ఇజ్రాయెల్ రచయిత, ఫిల్మ్‌మేకర్ ఎడ్గార్ కెరెట్, పోలెండ్ ఆర్కిటెక్చర్ జాకబ్ స్కెజ్‌స్నీ. పోలెండ్‌లోని వార్సాలో ఉన్న రెండు భవంతుల మధ్య ఎవరికీ చెందని ఇరుకు సరిహద్దు స్థలాన్ని ఆరేళ్ల క్రితం గుర్తించాడు జాకబ్. ఆ కొంచెం చోటు చాలు ఓ ఇల్లు కట్టేయడానికి అని నిర్ణయానికి వచ్చేశాడు. ఇతడికి ఎడ్గార్ తోడై ఇల్లు కట్టి చూపించి కెరెట్ హౌజ్‌గా బోర్డు తగిలించేసుకున్నారు. ఉన్న కాస్తంత చోటును చాలా తెలివిగా ఉపయోగించి నివాసానికి వీలుగా మార్చారు. ప్రపంచంలోనే అతి ఇరుకైన ఇల్లుగా గుర్తింపు తెచ్చుకున్న దీని అతి వెడల్పు గోడ కొలత 48 అంగుళాలు. యాజమాన్య హక్కులు, నిర్మాణ పరిమితులతో కాస్త ఇబ్బంది కలిగినా పాలిష్ ఆర్ట్ ఫౌండేషన్ వారి చొరవతో గృహప్రవేశం చేశారు. ఈ బక్కపల్చటి ఇంటికి 50 లక్షల వరకు ఖర్చయిందని తెలిసి నోరెళ్లబెట్టకండే..

కథ ◆

మధురం

మూలం: డి. జయకాంతన్

తెలుగు: డా॥దేవరాజు మహారాజు

మధూ నువ్వు జీవితాంతం ఒంటరిగాఉండడానికి వీల్లేదు. మరో జీవిత భాగస్వామిని ఎంచుకో! నేనా అంతిమ ఘడియలు లెక్కిస్తున్న వాణ్ణి. నా జ్ఞాపకాలు నాతో పాటు పోనీయ్. అవి శాపాలై నిన్ను వెంటాడినట్టు కలగన్నాను. ఉలిక్కిపడి లేచి వణికిపోయాను. అప్పుడు నువ్వేమన్నావూ?
" కలలన్నీ కల్లలండీ" అన్నావు. ఆశలతో ఆయుష్షు పెరుగుతోంది అని కూడా అన్నావు.
"కానీ చూడు ఎంత తరిగిపోయిందో! మృత్యువు మాట వినిపిస్తేనే జడసుకునే వాణ్ణి. కాని ఇప్పుడు అలాంటి భయాలేవీ లేవు.
అన్నింటితో బంధాలు తెంచుకుని దాని కోసమే ఎదురు చూస్తున్న వాణ్ణి. మధూ ప్లీజ్ ఏడవకు. ఏడవడానికి ముందు ముందు నీకు చాలా సమయం దొరుకుతుంది. నా సూర్యుడు అస్తమిస్తున్నాడు. నా నిష్క్రమణం నీ జీవిత గ్రహణం కాకూడదు. నీ మీద ఏ నీడలూ పడకూడదు. ఈ మాత్రం దానికి లేనిపోని సెంటిమెంట్స్ పెంచుకుని నీ నవ్వుల్ని ఆర్పేసుకోకు మధూ!మైడియర్ !ప్లీజ్! ఏడవకు. ఈ కాసేపు ఏదైనా మాట్లాడు." కట్టలు తెంచుకుని వస్తున్న దుఃఖంలో మధురం తన సుదీర్ఘమైన మౌనాన్ని ముక్కలు చేసింది. ప్రేమించి సాధించుకున్న భర్త
అబ్రహం ఆరు నెలల్లోనే చేయి జారిపోతున్నాడు. ఆమె భరించలేక పోతోంది."అబ్రహం ప్లీజ్! మీరలా మాట్లాడొద్దు. నేను భరించలేను నా గుండెలు పగిలిపోతున్నాయి."పిచ్చిదానా! నాకు మాత్రం బతకాలని లేదా? నీ సహచర్యాన్ని వదులుకుని పోతున్న నేనెంత దురదృష్టవంతుణ్ణి? అది ఆలోచించావా? జీవితం ఇసుక లాంటిది. పిడికిట్లో ఎంత గట్టిగాపట్టుకుందామంటేఅది అంత త్వరగా వేళ్ళ సందుల్లోంచి జారిపోతుంది. అందువల్ల సమయం వృథా చేయకు. చెప్పు నా తర్వాత నువ్వేం
చేయాలనుకుంటున్నావూ?"అడిగాడు అబ్రహం. ఆ ప్రశ్నతో ఆమె పూర్తిగా మనోస్థైర్యాన్ని కోల్పోయింది. ఏం చెప్పాలో తోచలేదు.
" మా అమ్మా, అమ్మమ్మ ఏం చేశారో నేనూ అదే చేస్తాను. ఇందులో ఆలోచించేదేమీ లేదు కళ్ళు మూసుకుని కాసేపు నిద్రపోవడానికి ప్రయత్నించండి"అంది.
"లేదు మధూ! నేను కళ్ళు మూసుకోలేను.మూసుకుంటే తెరుస్తానో లేదోనన్న భయం!ఉన్న ఈ కొద్ది సమయం వృథా చేయలేను.
నిన్ను చూస్తూ ఇలాగే గడపాలని ఉంది."
కొద్దిసేపు గడిచింది. మృత్యువుతో తీవ్రంగా పోరాడుతున్న అబ్రహం చివరి క్షణం వరకు భార్యకు నచ్చజెప్పే
ప్రయత్నంలోనే ఉన్నాడు. మధూ నేను చెప్పేది కొంచెం ఆలోచించు. మీ అమ్మా, అమ్మమ్మ లు, వాళ్ళు కావాలనుకున్న వ్యక్తిని పెళ్ళి చేసుకోలేదు. వాళ్ళంతా సంప్రదాయానికి తలవంచి బతికారు. మనం అలా కాదు హిందూ ధర్మాన్ని కాని, క్రైస్తవ ధర్మాన్ని గాని పాటించలేదు. మన స్వాక్షిగా చట్ట ప్రకారం పెళ్ళి చేసుకున్నాం. ఆ చట్టమే నీకు నా తర్వాత మళ్ళీ పెళ్ళి చేసుకునే అవకాశం ఇస్తుంది.
"చట్టం !చట్టం! ఏ చట్ట ప్రకారం మిమల్ని ప్రేమించానూ?
ఏ చట్ట ప్రకారం మీరు నా జీవిత సర్వస్వమనుకున్నానూ? ప్రేమకు చట్టాలు, ధర్మాలు అక్కరలేదు, అబ్రహం! అది వేటికీ



లొంగదు. ప్రేమ చట్టాలూ, సూత్రాలూ వేరే ఉన్నాయి. నా మనసు ఏది చెబితే అది చేస్తాను. ఇక ఈ విషయం ఇంతటితో ఆపండి. మీరు మళ్ళీ మాట్లాడొద్దు." మధురం కఠినంగానే విసుక్కుంది.

అబ్రహం తన ప్రయత్నం విరమించుకోలేదు. అతని బాధంతా మధు భవిష్యత్తు గురించే.

"మగవాడెంత స్వార్థ పరుడో ఆలోచించావా మధూ! వాడు వాడికి అనువైన న్యాయ సూత్రాలు ఏర్పరుచుకున్నాడు. మరణం తర్వాత కూడా వాడు తన భార్యతో సంబంధాన్ని వదులుకోడు. ఒక వేళ ఆమె ముందు చనిపోతే ఆ బంధాన్ని అంతటితో మరచిపోతాడు. ఇదేమిటంటావూ? నేను చనిపోయినా నువ్వు నా దానివే అని అనుకోవడం బాగానే ఉంది. కాని అందులో నా స్వార్థమెంత ఉంది? నన్నొక స్వార్థపరుడిగా పోనిస్తావా మధూ!"

'మీ ప్రేమ గొప్పది అది మీ చేత అలా మాట్లాడిస్తోంది. మిమల్ని మీరు స్వార్థపరుడిగా భావించి బాధపడకండి. అయినా ఇప్పుడు మీకెందుకీ ఆలోచనలు? పోనీయండి, రిలాక్స్ అవండి నేను మీ దగ్గరే కూర్చున్నాను. ఊపిరి పీల్చుకోండి." మధురం ప్రేమగా అతని చేయి తన చేతిలోకి తీసుకుంది.

" పిచ్చి మధూ! నా బాధ నీకెలా అర్థమవుతుంది? మృత్యువును ఏ రకంగానూ తప్పించుకోలేం. మనం దాన్ని ఎక్కడో దూరంగా ఊహించుకుంటే,అది దూరం పోదు. అందుకే అనుకున్నదంతా గబగబా చెప్పాలని తొందర పడుతున్నాను. నా చివరి కోరిక నివేదించుకుంటున్నాను. జీవితాంతం నువ్వు సుఖంగా ...." అతని మాట మధ్యలో ఆగిపోయింది. మధురం నెమ్మదిగా దగ్గరికి జరిగి అతని పెదాలపై ముద్దు పెట్టింది.పెదాలు చల్లగా తాకాయి.

"అబ్రహం " గట్టిగా కేకేసింది. "ఇంత చల్లగా ఉన్నావేం?బాధగా ఉందా?

కంగారుగా అడిగింది. "లేదు లేదు బాధలేదు" అని బరువుగా అన్నాడు. కొద్ది సేపటి తర్వాత ఆమె చేతివేళ్ళు అతని పెదాల్ని తడుముతున్నాయి.

గతంలోని మధుర ఘడియలెన్నో కలలా, అలలా చెరిగిపోతున్న క్షణాన ఆమెకు దుఃఖం ఆగలేదు. యవ్వనపు అనుభవాలు ఊచకోత కోశాయి. కన్నీళ్ళు అడ్డుపడి అంతా మసకమసకగా అయింది. మంచులా చల్లబడిన అతని శరీరం ఏవో భయంకర వికృత ధ్వనుల్ని వినిపించినట్లయింది. తీరా చూస్తే ఏముంది?అతడు లేడు.

రోజులు, సంవత్సరాలు గడిచాయి. వైధవ్యం భయంకరమైనదని, సంప్రదాయం క్రూరమైందని, చాలా మంది నోట చాలాసార్లు విన్నది మధురం. కానీ ఆమె ఆ జీవితాన్నే కావాలని కోరుకుంది. అబ్రహం తీయని తలపులతో రోజులు దొర్లించడం ఆమెకు అలవాటయింది. చాలా సార్లు చాలా చోట్ల ఆమె అబ్రహంతో మాట్లాడుతుంది. ఆ రోజు వారి పుట్టిన రోజు

ఆమె ఆ మాటే అబ్రహం ఫోటో ముందు నిలబడి అంది.

"అబ్రహం! ఇవాళ మన పుట్టిన రోజు. మీది ముప్పై ఏడవ జన్మ దినం, నాది ముప్పై ఐదవది. కానీ మీరు ఇరవై ఏడేళ్ల దగ్గరే ఆగిపోయారు.

ఇప్పుడు నేనే మీకన్నా పెద్దదాన్ని. ఎన్నేళ్ళు గడిచినా మీరు నాకు ఇరవై ఏడేళ్ల వాడి లాగానే గుర్తుంటారు. సంప్రదాయాల ప్రకారం చూసుకున్నా, తనకన్నా చిన్న వాళ్లను ప్రేమించే హక్కు విధవరాలికి ఉంటుంది. నేను ముసలిదాన్నయినా మీరు నా జ్ఞాపకాల్లో యువకుడిగానే ఉంటారు."

ఆ మరునాడు ఎదురింట్లో ఎవరో కొత్తవారు దిగారు. ఆ వచ్చినతను అబ్రహం లాగానే ఉన్నాడు. అతని రూపురేఖలు నడక అన్నీ అబ్రహం బతికున్నాడని అనిపించేట్లు ఉన్నాయి.

జ్ఞాపకాల్లో చూసుకునే అబ్రహం, కళ్ళ ముందు కనిపించే సరికి గాబరా పడింది మధురం. తరచూ కనబడడం మనసు అతని వైపు లాగుతుండటం ఆమె ప్రశాంత జీవనంలో కల్లోలం చెలరేగింది. ఆమె పని చేసే స్కూలు స్టాఫ్ రూంలో కూర్చున్నప్పుడు కూడా అతడు ఉండి ఉండి జ్ఞాపకం వచ్చేవాడు. ఓ రోజు అనుకోకుండా అతడు ఎదురుపడ్డాడు.

చూడండి! మరేం లేదు, నేను మీ ఎదురింట్లో దిగాను. మీరేమీ అనుకోకపోతే మిమ్మల్ని పరిచయం చేసుకుందామని అనుకున్నాను.

చిత్రం! గొంతు కూడా అలాగే ఉంది.

" మీ పేరు? అడిగాడతడు.

"మధురం"

"మధూ! అని పిలవొచ్చా .... అభ్యంతరం లేకపోతే"

మధురం పేలవంగా నవ్వింది. నేను విడోని."

" ఆ.... తెలుసు. తెలుసుకున్నాను!"

ఆమె అతని కళ్ళలోకి చూసింది. ఆ కళ్ళలో అబ్రహం చూపే. ఆ క్షణం ఆమె మానసిక స్థితి ఆమెకు తెలియలేదు. ఏమైందో మరి మరునాడు టీకి ఆహ్వానించింది.

"ఓ ఎస్! మధు గారూ! తప్పకుండా వస్తాను. అయితే చిన్న షరతు. మీరు నుదుట బొట్టు పెట్టుకుని ఆహ్వానిస్తేనే వస్తాను. మీ జీవితంలోకి కొత్త అతిథిని మంగళప్రదంగా ఆహ్వానించండి." అన్నాడతడు.

ఆమె షాక్ తిన్నది. ఆలోచనల్లో కూడా అతడు అబ్రహం లాగానే ఉన్నాడు. తన భర్తలాంటి మనిషి మరొకతను ఉండడాన్ని ఆమె భరించలేకపోయింది.

ఆ మరునాడు కుంకుమ భరణి చేతిలోకి తీసుకుంది. ఆనాడు చనిపోయే ముందు తన భర్త ఎంత చెప్పినా ఎంత నచ్చ చెప్పినా తను వినలేదు. తన అమ్మ, అమ్మమ్మల్లా వైధవ్యం స్వీకరిస్తానని కరాఖండిగా చెప్పింది మరిప్పుడేమైంది?

మనసు అదుపు తప్పుతోందా! ఎందుకు ఆత్మ ద్రోహానికి తలపడుతోంది? చాలా సేపు ఆలోచించింది. చివరకు బొట్టు పెట్టుకోలేదు. కాలింగ్ బెల్ మోగింది. వెళ్ళి కొత్త అతిథిని ఆహ్వానించింది.

"రండి"

అతడు లోపలికొచ్చాడు."ముందుగా ఒక విషయం మన జీవితాల్లో అనూహ్యమైన పరిస్థితులను అర్థం చేసుకుందాం. ఇది నా భర్త ఫోటో" ఆమె గోడ వైపు చూపించింది. "అరెరె! నా ఫోటోలాగానే ఉంది" అతని ఆశ్చర్యానికి అవధులు లేవు.

"అవును కానీ, అది మీరు కాదు." ఆమె చాలా నిబ్బరంగా అంది. "ఈ చిత్రం మీకు ఒక అద్దం లాంటిది. మీరు నా భర్త ఫోటో చూసి మీ ప్రతిబింబాన్ని చూసుకుంటున్నట్లుగా అనుభూతి చెందుతారేమో. కానీ, నా విషయం వేరు. ఈ ఛాయా చిత్రమే నాకు ఒక వాస్తవం. దయచేసి అర్థం చేసుకోండి. నేను నా మనస్ఫూర్తిగా వైధవ్యాన్ని స్వీకరించాను. సమాజపు కట్టుబాట్లు, సంప్రదాయాలు నాకూ నా భర్తకూ మధ్యలేవు." మిమ్మల్ని చూడగానే నా మనసు కొంత తడబడింది. నిజమే అయితే దాని అర్థం, నేను నా భర్తను మరిచిపోతానని కాదు. నా సజీవ జ్ఞాపకాల మధ్య నేను సంతోషంగా జీవిస్తున్నాను. నా వాస్తవాన్ని నేను ప్రేమిస్తున్నాను. ప్రతిబింబాన్ని ప్రేమించలేను."

"..........".

2015 ఏప్రిల్ 8న చెన్నైలో కన్నుమూసిన తమిళ మహా రచయిత జ్ఞానపీఠ్ గ్రహీత, పద్మభూషణ్ డి.జయకాంతన్ (81) కు నివాళులర్పిస్తూ.....

◆ స్ఫూర్తి

'ఏదో ఒక వైకల్యం ఉండి బతుకు భారంగా మారి జీవించలేం. ఇక చావే శరణ్యం' అనుకునే వికలాంగులు చాలా మంది ఉంటారు. అలాంటి వారు 'చనిపోదాం' అనుకునే ముందు ఒకసారి బెంగళూరులో ఉన్న "వింధ్యా ఇన్ఫో మీడియా" కంపెనీని చూసిన తరువాత వారి అభిప్రాయం చెప్పమనండి. కచ్చితంగా వారి ఆలోచన తప్పు అని ఒప్పుకుంటారు. ఎందుకంటే అక్కడ పని చేసే వారంతా వికలాంగులే. వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఆశయంతో ఏర్పడిందే 'వింధ్యా ఇన్ఫో మీడియా'. ఆ ఆశయమూర్తే వై.ఎస్.పవిత్ర. చిన్న వయసులోనే ఉన్నతంగా ఆలోచించి నేడు అత్యున్నత శిఖరాలు అధిష్టించింది.

ఉద్యోగం వికలాంగులకు మాత్రమే

'కేవలం డిగ్రీ మాత్రమే చదివిన 22 సంవత్సరాల అమ్మాయి. కంపెనీ స్థాపించడమేంటి? అది కూడా వికలాంగుల కోసమంటే చాలా వింతగా ఉంది' అన్నారు. 'ఈమెకేమైనా పిచ్చా!' అని కూడా అనుకున్నారు చాలామంది. అలాంటి వారి మాటలు లెక్కచేయలేదు పవిత్ర. భర్త సహకారంతో అనుకున్నది సాధించింది.

డిగ్రీ చదివే రోజుల్లోనే పరిసర ప్రాంతాల్లోని మురికివాడలకు వెళ్లి వారి పిల్లలకు చదువు చెప్పేది. అక్కడ ఉన్న వికలాంగులు పడుతున్న కష్టాలను కళ్లారా చూసింది. అప్పడే నిర్ణయించుకుంది. వారి జీవితాల్లో వెలుగులు నింపాలని. అందుకోసం ఆమె తన సి.ఎ. చదువును మధ్యలోనే ఆపేసింది. అప్పటికే వారికి ఒక పాప. ఆ పాప పేరు మీద కంపెనీ పెట్టారు. ఆశయం ఉన్నతమైనదే అయినా పరిస్థితులు ఆమెకు అనుకూలించలేదు. సాధారణ వ్యక్తులకు సాంకేతికపరమైన శిక్షణ ఇవ్వాలంటేనే చాలా సమయం పడుతుంది. అలాంటిది వికలాంగులకు నేర్పడమంటే మాటలా! కత్తి మీద సామే. అందుకోసం ఆమె బధిరుల భాషనూ నేర్చుకుంది. కసి, పట్టుదలకు ఆత్మస్థైర్యం తోడైంది. ఆమె పడిన శ్రమ వృధా కాలేదు. సరైన శిక్షణ ఇస్తే ఎందులోనూ తక్కువ కాదని నిరూపించారు వికలాంగులు. కానీ ఎన్ని కష్టాలు పడినా విజయం మాత్రం అంత తేలికగా దొరకలేదు. పైగా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో భర్త సంపాదన నుంచి కొంత మొత్తాన్ని అందుకు ఉపయోగించేది.

అయినా సరే నీరసపడిపోలేదు. ఇనుమడించిన ఉత్సాహంతో చిన్న పెద్ద తేడా లేకుండా అన్ని కంపెనీలకు వెళ్లి వికలాంగులతో నిర్వహిస్తున్న 'వింధ్యా ఇన్ఫో మీడియా' గురించి చెప్పేది. విన్నవారు ఎంతగానో ప్రశంసించేవారు. అంత వరకు బాగానే ఉండేది. కానీ ప్రాజెక్టులు ఇవ్వమని అడిగితే ప్రశంసించిన కంపెనీలే పెదవి విరిచేవి. 'వికలాంగులతో పని చేయిస్తానంటున్నారు. అసలే డెడ్ లైన్లతో పరుగులు పెట్టాల్సిన పనులు. కోట్ల రూపాయల ప్రాజెక్టులు వారిని నమ్మి ఎలా ఇచ్చేది' అని అడిగేవారు. వారికి నమ్మకం కుదర్చడం కోసం ఆమె రకరకాల ప్రయత్నాలు చేసింది. ముందుగా పైలట్ ప్రాజెక్టు కింద పనులు తీసుకొని... వాటిని సకాలంలో పూర్తి చేస్తేనే డబ్బులు తీసుకుంటామని రకరకాలుగా వారిని ఒప్పించి ప్రాజెక్టులు సాధించారు. క్లయింట్లు కోరిన విధంగా వారికి సేవలు అందించారు. దానితో వెనకకు తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ఇప్పుడు ఐఎస్‌వో ధ్రువీకరణ పొందిన సంస్థగా ముందుకు దూసుకెళ్తోంది. అక్కడి ఉద్యోగులు పోటీ ఆధారిత బి.పి.ఓ సేవలు, డేటా ఎంట్రీ, డాక్యుమెంట్ల నిర్వహణ, అకౌంటింగ్ ప్రాసెసింగ్ వంటి అనేక రకాల సేవలను అందిస్తున్నారు.

శిక్షణ తీసుకున్న వారందరు అద్భుతంగా పని చేయడం మొదలు పెట్టారు. ఓ రుణ మేళా సంస్థకు ఈ ఆలోచన నచ్చి బ్యాంకు రుణం ఇవ్వడంలో ఆమె విజయ ప్రస్థానం మొదలైంది. కార్పొరేట్ కంపెనీల ఉద్యోగులకు దీటుగా వాళ్లకూ పనిలో శిక్షణనిచ్చి ప్రొఫెషనల్స్‌గా తయారు చేశారు. వారి సేవల్లో కొన్ని సూక్ష్మ రుణ సంస్థలకు సంబంధించినవీ ఉన్నాయి. అందుకే వారి పండుగలు పబ్బాలతో సంబంధం లేకుండా పనిచేస్తుంటారు. కష్టాలు తెలిసిన వాళ్లు కాబట్టే వారు 24×7 గంటలపాటు ఆ కంపెనీలో పనులు జరుగుతుంటాయి.

ఎనిమిదేళ్ల కిత్రం ప్రారంభమై అనేక కష్టాలకు అటుపోటులకు అదరక బెదరక నిలబడిన "వింధ్యా"కు ఈరోజున ఐబీఎం, విప్రో, ఎయిర్‌టెల్, ఐఎన్‌జీ వైశ్యా, యాహు, టైటాన్, కెనారా బ్యాంకు, మెట్‌లైఫ్ తదితర కంపెనీలకే కాక గ్లోబల్ ప్రాజెక్టులకు సైతం సేవలు అందిస్తోంది 'వింధ్యా ఇన్ఫోమీడియా'.

పవిత్ర చేస్తున్న కృషికి గుర్తింపుగా ప్రభుత్వం నుంచి "షెల్– హెలెన్ కెల్లర్" అవార్డు,   టాటా వారి "స్త్రీ శక్తి" పురస్కారం, బ్రిగేడ్ గ్రూప్ నుంచి "యంగ్ ఎచీవర్" అవార్డూ ... ఇలా ఎన్నో అవార్డులు ఆమెను వరించాయి.

-అనంతోజు మోహన్ కృష్ణ, ఫోన్: 8897765417

చెస్ ప్రస్తావన వచ్చిందీ అంటే... విశ్వనాథన్ ఆనంద్ పేరు తప్పక మదిలో మెదులుతుంది. ప్రపంచ ప్రసిద్ధ పతకాలు, ప్రశంసల మేరుపర్వతం మీద ఆసీనుడైన ఈ చెస్ మాంత్రికుడి పేరును ఏకంగా ఒక గ్రహానికే పెట్టేశారు. 1988లో కనిపెట్టిన ఆ చిన్ని గ్రహానికి '4538 విషీఆనంద్' అని నామకరణం చేశారు. అందనంత ఎత్తున వున్న మన చెస్ స్టార్ ... అత్యంత ఆసక్తిరమైన విషయాలను పంచుకున్నాడు.

ఆ ప్రేమతో .... నన్ను నేను మర్చిపోతా....

- నేను ఇంకా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదని, చెస్ యవనికపై నాదైన గుర్తింపు ఇప్పటికే పొందానని కొందరు అంటుంటారు. కానీ నాకు సంబంధించి ఇదే మంచి సమయమనిపిస్తుంది. ఆట గురించి నేర్చుకోవాల్సింది ఇంకా ఎంతో వుంది. నాకు నేనే అతి పెద్ద ప్రత్యర్థిని.
- నాకు చెస్ ఆడడంతోనే సరిపోతుంది. మరో ఆట గురించి ఆలోచించేంత సమయమే లేదు.
- మన దగ్గర ప్రతిభావంతులైన యువ క్రీడాకారులున్నారు. వారికి వేదిక కల్పించేందుకు పలు సంస్థల తరపున సాధ్యమైనంత వరకు ప్రయత్నిస్తుంటా. 2002 నుంచి 'ఎన్.ఐ.ఐ.టి మైండ్ చాంపియన్స్ అకాడమీ'తో కలిసి పనిచేస్తున్నాను. చెస్‌ను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలన్నదే మా లక్ష్యం. ఇవాళ ఆన్‌లైన్లో అత్యంత ఎక్కువగా వీక్షిస్తున్న క్రీడ చెస్. ఇదో శుభసూచకమని చెప్పుకోవాలి.
- నా భార్య అరుణ అద్భుతమైన వ్యక్తి. ఒకే సమయంలో అనేక రకాల పనులను ప్రతిభావంతంగా నిర్వహించగల సమర్థురాలు. నా శక్తిసామర్థ్యాలకు తను మూల స్థంభం లాంటిది. నేను ఒక్క మాట చెప్పకుండా నా భయాలను సైతం అర్థం చేసుకుని నడిచే మనిషి దొరకడం మంచిదే కదా.
- ఏ రోజులోనైనా అత్యంత సంతోషకరమైన భాగం వుందీ అంటే .... అది మా అబ్బాయి అఖిల్‌తో ఆడుకోవడమే. ప్రతిరోజూ ఉదయాన్నే ... తనతో నేను ఏ ఆట ఆడతానో తప్పక అడుగుతాడు. అప్పుడప్పుడు నా గదిలోకి వచ్చి చెస్ పావులను సర్ది వెళుతుంటాడు. అంతేకాదు! 'అప్పా చెస్ ఆడుతున్నాడు. అందుకని, నిశ్శబ్దంగా వుండాలి' అని చెప్తుంటాడు. వాడి ప్రేమ, నవ్వు... ఎంత స్వచ్ఛంగా వుంటాయంటే... ఒక్కోసారి నన్ను నేనే మర్చిపోతుంటాను.
- ఖగోళ శాస్త్రం, గణిత శాస్త్రం, సంగీతం అంటే నాకు ఆసక్తి. సమయం దొరికితే... సినిమాలూ చూస్తుంటా. రజనీకాంత్ అంటే ఇష్టం. ఈ మధ్య చూసిన సినిమా మాత్రం 'ది ఇమిటేషన్ గేమ్'. నిజంగా సినిమా నాకు నచ్చింది. అలన్ టురింగ్ గురించి, చెస్‌తో అతనికి గల అనుబంధం గురించి అప్పటికే చాలా చదివి వుండడం వల్ల ...సినిమా ఆసక్తికరంగా అనిపించింది.

✦

దర్శక నిఘంటువు దాసరి!

ఒక మేఘాన్ని చూపించి... ఎవరీ మేఘం? అంటే తెలుగువాళ్లంతా ముక్త కంఠంతో చెప్పే పేరు దాసరి నారాయణరావు. తెలుగు చలన చిత్రం చరిత్రను ఎవరైనా రాస్తే దాసరికి ముందు, దాసరి తర్వాత అని అభివర్ణించక తప్పదు. గతంలో వచ్చిన సినిమాలు పక్కా క్లాసూ... పక్కా మాస్‌కీ పరిమితమైతే... దాసరి చిత్రాలు మధ్య తరగతి జీవితాల్ని స్పృశించాయి. మధ్య తరగతి ప్రేక్షకులకు చేరువయ్యాయి. సినిమాల్లో తమ జీవితాన్ని ....తమ జీవనాన్ని తడిమి చూసుకోవడం నేర్చుకున్నారు. మధ్య తరగతి ప్రేక్షకుడికి ఐడెంటిటీ అన్నది అప్పటి నుంచే ప్రారంభమైంది.

నా జర్నలిజపు వ్యాసంగం దాసరి చిత్రాల సమీక్షలతోనే ప్రారంభమైంది. అవి నేను కాకినాడు పి.ఆర్ కాలేజీలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న రోజులు. మేముంటున్న మెహర్ లాడ్జి బాలాజీ చెరువు పక్కనే. ఆ పక్కనే పెద్ద పెట్రోల్ బంకు ఉంది. పెట్రోలు పోయించుకోవడం కోసం దాసరి ఆగారు. ఎవరో చెప్పారు దాసరి వచ్చారని. అంతే నాతో పాటు హాస్టల్ కుర్రాళ్ళందరం పరుగులు తీశాం. నా జీవితంలో మొట్ట మెదటి సారి చూశాను. "రాధమ్మ పెళ్ళి" చిత్రం షూటింగ్ యానాంలో జరిగింది. కాకినాడ సినిమా రోడ్‌లో షూటింగు జరగబోతుందని విన్నాను. సినిమాకి సంబంధించిన ప్రశ్నలు వెయ్యడం మొదలు పెట్టాను. రెండు మూడు ప్రశ్నలయ్యాక ఇక ప్రశ్నించడం ఆయన వంతయింది. ఏ సినిమాలు బాగున్నాయి? ఎందుకు బాగున్నాయి? ఎవరు బాగా చేశారు? ఏ పాటలు బాగున్నాయి? ఎవరు రాస్తే బావుంటుంది? సంగీతం ఎవరు చేస్తే నచ్చుతుంది.? ఇలా ఓ గంటసేపు ప్రశ్నల వర్షం కురిసింది. నా సమాధానాలు రాబట్టుకొని ...ఉత్తరాలు రాస్తూ వుండు... నీ రివ్యూలు చాలా ఇంట్రెస్ట్‌గా ఉన్నాయని కితాబు ఇచ్చి వెళ్ళిపోయారు. అప్పటి నుంచి దాసరి సినిమాకి తొలి ప్రేక్షకుడ్ని నేనేనేమో.

దాసరి ఎందుకు గొప్ప దర్శకుడు?

అని ఆత్మావలోకనం చేసుకుంటే ..దాసరి తొలి చిత్రం 'తాతా మనవడు'ని తీసుకుందాం...చిన్న స్టోరీ లైన్... ఆకాశమంత గొప్పది. ప్రేక్షకుల్ని నవ్వించింది. కవ్వించింది. కంట తడి పెట్టించింది. " అయ్యా .. అయ్యా ఎందుకు గొయ్యి?" అని ప్రశ్నిస్తే... "మీ అయ్యకు చేసిన ఈ మర్యాద ..రేపు నీకు చెయ్యాలి కదయ్యా" అంటాడు. తల్లిదండ్రులను మరచిపోయిన కొడుకు, కోడలు వారిద్దరికి కనువిప్పు కలిగించే పాత్రల్లో రాజబాబు .విజయ నిర్మల. ఎదురింటి కుటుంబం మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది. ఒక నిండు జీవితం సజీవంగా కనిపిస్తుంది. ముఖ్యంగా కథ, మాటలు వినూత్నంగా వున్నాయి. కనెక్ట్ అయ్యేలా ఉన్నాయి. పాత్ర పరిధుల్లో మాటలు అతికించినట్లున్నాయి. మనం చూస్తున్నది సినిమా అని తెలిసీ మహిళా ప్రేక్షకులు మాత్రమే కాదు, పురుషులు కూడ కళ్ళు వాచిపోయేలా ఏడ్చిన సందర్భాలు సినిమాలో కోకొల్లలు.

దాసరి దార్శనితకు నిదర్శనం సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శని, ఆది వీడికి చోటేదీ? పుట్టే వాడికి చోటేది? అప్పుడప్పుడే కోట్లు కుమ్మరించి ప్రచారం చేస్తున్న సినిమాకి, సంవత్సరం పాటు నడిచిన సినిమా ఒక సూపర్ హిట్ సినిమా ఏ మేరకు పబ్లిసిటీ ఇచ్చుంటుందో ఆలోచించండి. అలాగే 'సంసారం-సాగరం, రాధమ్మ పెళ్ళి'

బలిపీఠం

మేఘ సందేశం

బొబ్బిలి పులి

చిత్రాలు కూడా. ఈ మూడు చిత్రాల్లో వినోదం ఎంతుంటుందో మెలో డ్రామా అంతే వుంటుంది. సినిమా చూసొచ్చాక మరిచిపోలేని సంఘటనలు ఎన్నో తరుముకొచ్చే సంఘటనలు ఎన్నెన్నో ..అదీ దాసరి క్రేజ్.

దాసరి పారదర్శకతకు నిలువెత్తు నిదర్శనం 'స్వర్గం –నరకం' చిత్రం. అందరూ కొత్త నటీనటులే, మోహన్‌బాబు, ఈశ్వర్రావు, ఫటాఫట్ జయలక్ష్మి , ఉమ (ఇప్పటి అన్నపూర్ణ) ప్రధాన పాత్రల్లో దాసరి నారాయణ రావు ఆచారి పాత్రని పోషించాడు అని చెప్పే కంటే జీవించాడు అని చెప్పడం న్యాయం. ఆచారి పాత్రలో దాసరి పరకాయ ప్రవేశం చేశాడు. అది ప్రేక్షకుల మీద ఎంతటి ప్రభావాన్ని చూపించిందంటే ... కాకినాడ సూర్యకళా మందిర్‌లో 'స్వర్గం–నరకం' వందరోజుల వేడుక జరుగుతోంది. మురళీ మోహన్ నాకు మిత్రుడు. ఆయన తీసుకెళ్ళారు. సూర్యకళా మందిర్ ప్రేక్షకులతో కిటకిటలాడిపోతోంది. పోలీసులకు సైతం జనాన్ని కంట్రోల్ చెయ్యడం కష్టమైపోతోంది. దాసరి వేదిక మీదికి వచ్చి మైకు తీసుకొని "కాకినాడ ప్రేక్షకులు అభిరుచి గల ప్రేక్షకులు.. కాకినాడ ప్రేక్షకులు నాకు చాలా ఇష్టమైన ప్రేక్షకులు. నా సినిమాల మీద తొలి తీర్పు, తుది తీర్పు చెప్పేది కాకినాడ ప్రేక్షకులే". అనేసరికి ప్రేక్షకులు చల్లబడిపోయారు.

ఫినిష్! అన్నారు దాసరి.

కేరింతలు కొడుతూ దాసరి దారికొచ్చేశారు. దాసరి ఏం చెబితే అది చెయ్యడం మొదలు పెట్టారు. ఆయన నూరు రోజుల వేడుక కాకినాడలో నిర్వహించిన తీరు జీవితంలో మరిచిపోలేను. అంత పెద్ద ఫంక్షనుకి కంపేరింగ్ ఎవరూ లేకపోయినా ప్రేక్షకుల చేతనే కంపేరింగ్ చేయించి ఆ సభను గ్రాండ్ సక్సెస్ చేశారు. ఆ చతురత నభూతో న భవిష్యతి.

మురళీమోహన్‌కూ నాకూ లెటర్స్ కరెస్పాండెన్స్ ఉండేది. తను సోలో హీరోగా నటించిన దాసరి చిత్రం 'భారతంలో ఓ అమ్మాయి' చూసి అభిప్రాయం చెప్పమని లెటర్ రాశాడు. మొదటి ఆటనే చూశాను.. మతి పోయింది. అక్కడ మురళి వున్నాడా? రోజా రమణి వుందా? అనే విషయాన్ని మరిచిపోతాం.. మన పొరు గింటి అమ్మాయి జీవితం అనుకుంటాం. ఆదమరచిపోతాం.

ఓ ప్రైవేట్ బ్యాంకులో డివిజనల్ మేనేజర్‌గా ఉన్న నేను, మద్రాసు పయనం, ఓ పెద్ద సినీ పత్రికల్లో పని చెయ్యడం, దాసరి శిష్యరికం చెయ్యడం నా అదృష్టం. అప్పుడర్థమైంది దాసరి విశ్వరూపం. ఆశువుగా కథ చెప్పడం....ఆశువుగా డైలాగులు రాయడం. ఆశువుగా పాటలు రాయడం. వీటికి ప్రత్యక్ష సాక్షి నేను. ఏదో శక్తి ఆవహించినట్లు చెప్పేవారు. ఎన్నో పుస్తకాల సారాంశాన్ని అలవోకగా చెప్పేవారు. చాలా సందర్భాల్లో ఆశ్చర్యపోయేవాడ్ని. కత్తిమీద సాము లాంటి ఎన్నో కథా వస్తువులకి ప్రాణ పతిష్ట చెయ్యగలగడం దాసరికే చెల్లింది. 'ఎవరికి వారే యమునా తీరే' చిత్రం. రాజబాబు హీరో. ఆ చిత్రం వంద రోజులాడింది. నవ్విస్తూ ఏడిపించడం. ఏడిపిస్తూ నవ్వించడం దాసరికే చెల్లింది. భావోద్వేగాలను అంత గొప్పగా పండించగల దర్శకుడు అప్పట్లో మరొకరు లేరంటే అతిశయోక్తి కాదేమో. ముప్పాళ్ల రంగనాయకమ్మ బలిపీఠం కథను హ్యాండిల్ చెయ్యడం చాలా కష్ట సాధ్యం. కులాంతర వివాహం. అందులో తారసపడిన సంఘటనలు..శారద, శోభన్‌లు నాయకి నాయకులు దాన్ని తెరకెక్కించడం కత్తిమీద సాము. ఆ సాము దాసరి చాకచక్యంగా చేశారు.

మరో రెండు చిత్రాల గురించి ప్రస్తావించకుండా ఉండలేకపోతున్నాను. చిల్లరకొట్టు చిట్టెమ్మ, శివరంజని. మొదటిది వాడవాడలా జనరంజకమైన నాటకం. రెండవది ఒక సినిమా నటి జీవితం. కేవలం జయసుధని ప్రమోట్ చెయ్యడానికి అల్లబడిన కథలా అనిపించింది. తన స్వంత బ్యానర్‌లో నిర్మించిన చిత్రం. ఎక్కడ మోతాదు మించినా, తగ్గినా సినిమా అపభ్రంశం అవుతుంది.దాన్ని ఒక దృశ్య కావ్యంగా మలిచారు దాసరి. తర్వాత సినీ నటి జీవితం మీద సినిమాలొచ్చాయి గాని 'శివరంజని' ఒక్కటే రస సిద్ధిని సాధించిన చిత్రంగా చెప్పుకోవచ్చు.

తర్వాత అగ్రనటులిద్దరూ దాసరి జీవితంలోకి ప్రవేశించారు. 'దేవదాసు మళ్ళీ పుట్టాడు' చిత్రంతో అక్కినేని... 'మనుషులంతా ఒక్కటే చిత్రంతో ఎన్.టి.ఆర్. ఇద్దరితో తీసిన తొలి చిత్రాలు హిట్ అయ్యాయి. ప్రత్యేకించి దాసరి అగ్రనటులిద్దర్నీ బాగా హ్యాండిల్ చేశారన్న పేరొచ్చింది. కొంత కాలం గ్యాప్ వచ్చినా దాసరి పట్ల సద్భావం ఏర్పడింది. దాసరి కథ చెబితే నో చెప్పే ప్రసక్తే లేకుండా చేశారిద్దరూ. వరుసగా అక్కినేనితో "ఏడంతస్తుల మేడ, శ్రీవారి ముచ్చట్లు, బుచ్చిబాబు, బహుదూరపు బాటసారి, జస్టిస్ చక్రవర్తి, మేఘసందేశం...' తదితర చిత్రాలు చేస్తే... ఎన్.టి.ఆర్‌తో 'సర్కస్ రాముడు, సర్దార్ పాపారాయుడు, బొబ్బిలిపులి" లాంటి సూపర్ డూపర్ హిట్ చిత్రాల్ని చేశారు. ఎన్.టి.ఆర్. రాజకీయ జీవితానికే ప్రేరణ కలిగించిన చిత్రంగా 'బొబ్బిలిపులి'ని కొనియాడటం మనందరికీ తెలుసు. ముఖ్యంగా దాసరి సంభాషణలు రాసిన తీరు, ఈ సంభాషణలను ఆయా నటులు పలికిన తీరు మరచిపోలేం. 'మేఘ సందేశం' ఒక్క చిత్రానికే ఎనిమిది జాతీయ అవార్డులు వచ్చాయంటే దాసరి ఐక్యూ ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

భార్య పద్మతో...

దర్శకుడిగా దాసరి జీవన పయనంలో శోభన్, కృష్ణంరాజు, కృష్ణ, మోహన్‌బాబు, మురళీ మోహన్‌లు పంచరత్నాలుగా ఒదిగిపోయారు. శోభన్ బాబుతో 'బలిపీఠం, గోరింటాకు, స్వయం వరం, దీపారాధన' చిత్రాలు చేస్తే ...కృష్ణంరాజుతో 'కటకటాల రుద్రయ్య, రంగూన్‌రౌడీ, బొబ్బిలి, సీతారాములు...' చిత్రాలు...కృష్ణతో "రాధమ్మ పెళ్ళి, కృష్ణావతారం" చిత్రాలు మోహన్‌బాబు, మురళీ మోహన్‌తో హోమ్ ప్రొడక్షన్లోనే గాకుండా ఇతర సినిమాలు చేశాడు. ఆ రోజుల్లో అగ్రనటులనిపించుకున్న శోభన్, కృష్ణం రాజుతో మంచి అవగాహన కుదిరింది. మంచి సక్సెస్‌లు దక్కాయి. దాసరి జీవితంలో మరో కలికితురాయిగా నిలిచిపోయే చిత్రం 'ఒసేయ్ రాములమ్మ. విజయశాంతిని రాములక్కగా తీర్చిదిద్ది చరిత్రలో నిలిచిపోయేలా చేశాడు ఈ దర్శకరత్న.

ఆయన ప్రారంభించిన 'ఉదయం' పత్రిక ఓ సంచలనం. రెండు లక్షల పాతికవేలు సర్క్యులేషన్. అన్నీ కలర్ పేజీలు. శివరంజని సినిమా పత్రిక సాహిత్య సొబగులతో రాణించాయి. దినపత్రిక నిర్వహణలో రాజకీయాలు కొంత మేరకు ఆకర్షించాయి. దాసరి స్వతహాగా ఆవేశపరుడు. భోళాశంకరుడు. దాసరి కోపం తాటాకు మంట వంటిది. గుప్పున మండి చప్పున చల్లారిపోతుంది. ఈలోగా జరగవలసిన నష్టం జరిగిపోతుంది.

ఎంత మంది అసిస్టెంట్లు ? ఎంతమంది ఇంట్లో దీపం పెట్టాడు? ఎందరికి జీవితాన్నిచ్చాడు. నెలకు నాలుగు సినిమాల వంతున సంవత్సరానికి పదహారు సినిమాలు చేసి సంచలనాలు సృష్టించిన తొలి దర్శకుడు దాసరి! అనతి కాలంలోనే వంద సినిమాలు పూర్తి చేసి గిన్నిస్ బుక్ రికార్డ్‌లోకి ఎక్కిన తొలి దర్శకుడు దాసరే! దాసరి–దర్శకుడనే పదానికి సరికొత్త భాష్యంగా నిలిచి కింగ్ మేకరయ్యాడు. దర్శకుడంటే పారితోషికం తీసుకొని పని చేసే సేవకుడు కాదు. పదిమందికి పని కల్పించేవాడు. తను చేస్తున్న పని ఫలప్రదమయ్యేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయని వాడు. కెప్టెన్ ఆఫ్ ది షిప్‌గా పేరు ప్రతిష్టలు సంపాదించిన వాడు దాసరే! ఒక్క మాటలో చెప్పాలంటే దాసరి ఒక విశ్వవిద్యాలయం! భావితరాల దర్శకులకు దర్శక నిఘంటువు దాసరి!

ఈ డాక్టర్ దాసరి!

(మే 4 దాసరి నారాయణ రావు పుట్టిన రోజు సందర్భంగా)

ఇమంది రామారావు

-9010133844

'పద్మ' పరిమళాలు

సుబ్బయ్య అరుణన్

రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ ని అందుకుంటున్న విమల కుమారి

ఈ యేడు ఏరికోరి 104 మంది మహోన్నతులను పద్మ అవార్డులకు ఎంపిక చేశారు. ఒక్కో వికసిత పద్మానిది ఒక్కో గాథ, ఒక్కో నేపథ్యం. కొన్ని పద్మాలు మనకు సుపరిచితం. ఎన్నో ఏళ్లుగా మీడియా ద్వారా పరిచయం. కొందరి పేర్లను వినడం అప్పుడే తొలిసారి. సేవా పరిమళాల్ని అందినా వారి వివరాలు అంతగా తెలియవు. వారిలో కొందరి గురించైనా, కాస్తైనా తెలిస్తే వారి సేవలకు నిజమైన గౌరవం అందుతుంది. వారి ప్రతిభకు న్యాయమైన సత్కారం దక్కుతుంది. మరికొందరు వారి నుంచి స్ఫూర్తి పొందితే పద్మ సత్కారాలకు ఫలితం లభిస్తుంది.

అడవిని నాటాడు

జాదవ్ మొలాయ్ పాయెంగ్ పేరిట అస్సాంలో ఓ అరణ్యమే ఉంది. అంతరించిపోతున్న బెంగాల్ పులులు, ఖడ్గమృగాలు, డేగలకు తోడు కొన్ని వందల కుందేళ్లు, జింకలు, సరీసృపాలు, రకరకాల పక్షులకు నెలవు ఆ మొలాయ్ అరణ్యం. వరదలకు వెదురు చెట్లు కొట్టుకుపోయి ఖాళీ అయిపోయిన ఆ ప్రాంతంలో తిరిగి మొక్కలు నాటుతూ పచ్చదనంతో నింపేశాడు. ఇప్పుడా అడవి 1,360 ఎకరాల మేర విస్తరించి వేల వృక్షాలతో నిండిపోయింది. ఆయన సేవలను గుర్తిస్తూ పద్మశ్రీతో గౌరవించింది ప్రభుత్వం.

గురు యోధ

ఒలంపిక్స్ స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్ పేరు చాలా మందికి తెలిసి ఉంటుంది. ఆయన విజయం వెనుక ఉన్న కోచ్, ఒకప్పటి మేటి రెజ్లర్ సత్పాల్ సింగ్ గురించి తెలిసింది చాలా కొద్దిమందికే. ఆసియా గేమ్స్ రెజ్లింగ్ విభాగంలో 1974లో కాంస్యం, 1982లో బంగారు పతకాల్ని సత్పాల్ గెలిచారు. ప్రస్తుతం ఢిల్లీలో రెజ్లింగ్ అఖాడా నడుపుతున్నారు. ఆ అఖాడా నుంచి వచ్చిన వాడే స్టార్ రెజ్లర్ సుశీల్ కుమార్. ఆయన సేవలకు గుర్తింపుగా పద్మభూషణ్ వరించింది.

'పట్టు' మనిషి

రాహుల్ జైన్ కృషి వల్లే అతి పురాతన వారణాసి చేనేత పట్టు పరిశ్రమ పునరుజ్జీవనం పొందింది. వస్త్ర కళాకారుడిగా, చరిత్రకారుడిగా, రచయితగా ఆయన సేవలను అందిస్తున్నారు. 1993లో ఆశా ఫౌండేషన్ స్థాపించి సాంప్రాదాయిక ఇండో ఇరానియన్ శైలి వస్త్ర కళకూ ఊపిరి పోశారీ పద్మశ్రీ.

ఆరోగ్య ప్రదాయని

మణిపూర్‌లోని ఇంఫాల్ పశ్చిమ ప్రాంతంలో మెడికల్ ఆఫీసర్‌గా సేవలు అందిస్తున్నారు సారంగ్బమ్ బిమల కుమారి దేవి. అతి సమస్యాత్మక ప్రాంతంలో దయనీయమైన ఆరోగ్య పరిస్థితులను ఎదుర్కుంటున్న ప్రజలకు అండగా నిలచి ఆరాధ్యురాలిగా మారారు. మారుమూల గ్రామాల్లో మూడు దశాబ్దాల పైగా సేవలనందిస్తూ ఆదర్శనీయులయ్యారు. పద్మశ్రీని అందుకున్నారు.

పరమ్ 'ఆత్మ'

ప్రపంచంలో అతిపెద్ద ఐటీ కేంద్రంగా భారత్, ఈ స్థాయికి చేరడంలో విజయ్ పి.భట్కర్ అవిశ్రాంత కృషి ఉంది. భారత్ తొలి సూపర్ కంప్యూటర్ పరమ్ (1991)ను భట్కరే రూపొందించారు. పరమ్ సిరీస్‌లో నేషనల్ సూపర్ కంప్యూటింగ్ ఫెసిలిటీని ఏర్పాటు చేసి గరుడ గ్రిడ్ ద్వారా జాతికి అత్యంత స్థాయి కంప్యూటింగ్ సేవలను అందించారు. శాస్త్ర, సాంకేతిక రంగంలో భారత్ ప్రపంచానికే నాయకత్వం వహించే జాతీయ మిషన్‌కు రూపకల్పన చేస్తున్నారు. పద్మభూషణుడిగా గౌరవాన్ని పొందారు.

గుండె చప్పుడు

దాదాపు 20 వేల యాంజియోప్లాస్టీలు, 50 వేల యాంజియోగ్రామ్‌లు చేసి వేల మంది ప్రాణాల్ని నిలబెట్టిన హృద్రోగ చికిత్స నిపుణులు డాక్టర్ అశోక్ సేథ్. ఉపఖండంలో యాంజియోప్లాస్టీ, డైరెక్షనల్ అథెరెక్టమీ నిర్వహించిన ప్రప్రథముడు ఈయనే. సంక్లిష్టమైన ఇంపెల్ల వైద్య పరికరాన్ని, డ్రగ్ ఎల్యూటింగ్ స్టెంట్, బయోరిజార్బబుల్ స్టెంట్, థ్రోంబెక్టమీ పరికరాల్ని భారత్‌కు పరిచయం చేశారు. ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజీలో ఆయన సేవలు మరువలేనివి. దానికి గుర్తింపుగానే ఆయన్ను పద్మ భూషణ్‌తో గౌరవించింది ప్రభుత్వం.

పథం.. హిమానీనదం

అతి శీతల, పొడి వాతావరణమున్న లఢక్ పర్వత ప్రాంతంలో నీటి కష్టాలను తీర్చేందుకు కృత్రిమంగా హిమాని నదాల్ని తయారుచేసే పద్ధతిని కనిపెట్టారు చెవాంగ్ నోర్ఫెల్. డెబ్బై తొమ్మిదేళ్ల ఈ సివిల్ ఇంజినీర్ కృషి ఫలితంగా తాగునీటితోపాటు, వ్యవసాయ అవసరాలకు స్థానికులకు పుష్కలంగా నీరు లభ్యమవుతోంది. పట్టణ ప్రాంతాలకు వలసలు తగ్గిపోవడంతో పాటు వ్యవసాయోత్పత్తి కూడా బాగా పెరిగింది. దీన్ని గుర్తిస్తూ ఆయనకు పద్మశ్రీ ప్రదానం చేశారు.

తంత్రి మంత్రం

కర్నాటక శైలి వాయులీనంలో ప్రముఖ విద్వాంసురాలు ఎ.కన్యాకుమారి. నాలుగు దశాబ్దాల సంగీత జీవితంలో ఆమె వయోలిన్ వాద్యంలో ఎన్నో కొత్త సృజనలు చేశారు. వీణ, వయోలిన్, నాదస్వరాలను జోడించి 'వాద్య లహరి'ని సృష్టించారు. మూడు వయోలిన్‌లను ఉపయోగించి వివిధ స్థాయిల్లో ఓ ప్రత్యేక తంత్రి సృజన 'తృస్థయి సంగమమ్'ను సంగీత ప్రియులకు అందించారు. మేటి సృజనలను అభిమానులకు అందించిన ఈ సంగీతకర్త ప్రతిభకు పద్మశ్రీ వరించింది.

'మామ్' సుబ్బయ్య

మార్స్ ఆర్బిటర్ మిషన్ (మామ్) అపూర్వ విజయంతో ప్రపంచానికి సత్తా చాటారు భారత ఖగోళ శాస్త్రవేత్తలు. మంగళయాన్‌ను మంగళకరంగా పూర్తిచేయడంలో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సుబ్బయ్య అరుణన్ కీలక పాత్ర వహించారు. అతి తక్కువ ఖర్చుతో ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఈయన బృందం కనిపెట్టిన టెక్నిక్‌కే కీలకం. భూమ్యాకర్షణ పరిధి నుంచి జారిపోయి అంగారక గ్రహం గురుత్వాకర్షణ పరిధిలోకి విసిరి పడేలా రూపొందించిన అతి సంక్లిష్టమైన ఆపరేషన్‌ను ముందుండి నడిపించాడు. చాలా ఏళ్లకు ముందే అంగారక గ్రహ గమన తీరును గమనించి, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసినందుకు పద్మశ్రీతో ప్రభుత్వం సత్కరించుకుంది.

వినిపించని విలాపం



చివికిపోయిన తెల్లచీరల్లో బక్కపల్చటి దేహాలు... వంగిన వెన్ను, శూన్యంగా చూసే నిర్వికార నయనాలు... తడబడే అడుగులు... గుడి మెట్ల దగ్గర చాచిన చేతులు... పట్టెడు మెతుకుల కోసం గంటల తరబడి దైవ జపం చేసే జీవం లేని పెదాలు...! ఇలాంటి వారు వేలాదిగా కనిపించే నగరాలు రెండు... బృందావన్, వారణాసి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలుగా... వితంతు నగరాలుగా పేరుబడిపోయిన ఈ జంట నగరాల్లో ఎక్కడ చూసినా వీరే. ఆశ్రమాలు, ఆలయాలు, ఘాట్‌లు, వీధుల్లో... ఎక్కడ కాస్త జాగా దొరికినా నిశ్శబ్దంగా సర్దుకుపోతారు. వీళ్లు వయోవృద్ధులేమీ కాదు. అక్కడ ఆఖరి శ్వాస విడిచి ఇహలోక బంధాల నుంచి విముక్తి పొందాలని ఆరాటపడే ఏకాకులు.

- కె. అంజన

ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్, వారణాసి నగరాలు ఆధ్యాత్మిక నగరాలుగా భాసిల్లుతున్నాయి. బృందావన్ యమునా నది ఒడ్డున మధుర జిల్లాలో వుంది. పురాణగాధల ప్రకారం కృష్ణుడి బాల్యం అక్కడే గడిచిందని విశ్వాసం. వారణాసినే బెనారస్ అనీ, కాశి అనీ పిలుస్తారు. శివారాధనకు ప్రథమ పీఠం. గంగానది ప్రవహిస్తుందిక్కడ. కాశీలో చివరిశ్వాస విడిస్తే పుణ్యమని పూర్వం నుంచి నమ్మిక. పైగా ఇక్కడ వేలాది ఆలయాలుంటాయి. వైధవ్యం ప్రాప్తించిన మహిళలు శివకేశవుల చింతనలో గడపమని ఇక్కడికి పంపి వదిలించుకుంటుంటారు అయినవాళ్లు.

బిందేశ్వరీ దేవి రాజస్థాన్ నుంచి బృందావన్ చేరుకుంది. పాతికేళ్ల వయసులో భర్త పోయాడు. తర్వాత కొడుకులిద్దరూ కూడా చనిపోవడంతో కోడళ్ల ఆరళ్లు పడలేక...వారణాసి చేరుకుంది.

♦ ♦ ♦ ♦ ♦

కృష్ణాదేవిది మరో ఘోర విషాదం. నేపాల్‌కి చెందిన ఈమెకు తొమ్మిదేళ్లకే 35 ఏళ్ల వ్యక్తితో పెళ్లయింది. పెళ్లంటే ఏంటో అర్థమయ్యే నాటికే భర్త చనిపోయాడు. సరిగ్గా అప్పుడామెకు 18 సంవత్సరాలు. శివసాన్నిధ్యంలో తతిమ్మా జీవితం గడిపేందుకు వారణాసి చేరుకుని ఇరవయ్యేళ్లకు పైనే అయ్యింది.

♦ ♦ ♦ ♦ ♦

ఆరేళ్ల బీనా బీహార్ వాసి. ఆమెను 32 ఏళ్లతనికిచ్చి పెళ్లిచేశారు బలవంతంగా. మూడేళ్లపాటు భర్త ఆమెను నానా హింసలు పెట్టాడు. కొన్నేళ్లకు అతను చనిపోవడంతో ... బీనా వంటరైంది. మేజరయ్యాక భర్త ఆస్తిలో వాటా అడుగు తుందని ఆమెను బెనారస్ పంపించేసి అడ్డు తొలగించుకున్నారు.

♦ ♦ ♦ ♦ ♦

సోండీకి (ఒడిషా) ఇప్పుడు ఎనభయ్యేళ్లు. బాగా చిన్న వయసులోనే పెళ్లి...పిల్లలు...ఒంటరితనం అన్నీ చవిచూసింది. భర్త పోయాక ముగ్గురు పిల్లలను సాకి పెద్ద చేసింది. పెళ్లిళ్లయ్యాక వారి నిరాదరణ, వేధింపులు భరించలేక బృందావన్ చేరుకుంది.

వీరే కాదు! పన్నాదేవి, సీతామణి, వేదవతి, రామ్‌కాళి...వంటి వారెందరో బెనారస్, బృందావన్ నగరాలలో కనిపిస్తారు. ప్రతి ఒక్కరి వెనక ఒక్కో గాథ. ఒక్కో వ్యథ. హృదయాలను కదిలించి వేస్తాయి. మధ్యప్రదేశ్, బీహార్, ఒడిషా, అస్సాం, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్... రాష్ట్రాల నుంచి వీరంతా ఇక్కడికి చేరుకుంటుంటారు. ఈ ప్రయాణం ఈనాటిది కాదు. వందల యేళ్ల నాటి నుంచీ సాగుతూనే వుంది. శాపగ్రస్తుల పేర్లు, ప్రాంతాలు మారుతుంటాయంతే. శతాబ్దాలుగా సుదూర తీరాల నుంచి ఆధ్యాత్మిక నగరాలకు చేరుకుంటూనే వున్నారు... అనేకంటే దగ్గరుండి మరీ బలవంతంగా రైళ్లెక్కించి చేతులు దులుపుకుంటున్నారు అనవచ్చు. ఇళ్లల్లో వేధింపుల నుంచి... పేదరికం నుంచి బైటపడొచ్చని ... ఆధ్యాత్మిక కేంద్రం కనక భక్తి గీతాలు ఆలపిస్తూ చివరి రోజులు గడిపేయొచ్చని ఇక్కడకు చేరుకునే వారి సంఖ్యా ఎక్కువే.

కట్టుబాట్ల బందిఖానా

మూఢనమ్మకాలకేం కొదవ లేదు మన దేశంలో. నల్ల పిల్లి ఎదురొచ్చినా.... పగిలిన అద్దం చూసినా చెడు జరుగుతుందని చెప్పేవారు.... ఒక వితంతు మహిళను ... పిల్లి కన్నా హీనంగా ...దుశ్శకునంగా భావించడంలో వింతేముంది?! ఐదోతనం కోల్పోయిన మహిళ ... మతం విధించిన కట్టుబాట్ల కారణంగా ... ప్రాణం మినహా అన్నిటినీ చేజార్చుకుంటోంది. అన్ని ప్రాంతాల్లో ... మరీ ముఖ్యంగా... ఉత్తరాది రాష్ట్రాలలో పూర్వం నుంచీ వితంతువులను దుశ్శకునంగా పరిగణిస్తున్నారు. వివాహం వంటి శుభకార్యాల్లో ఆఖరికి వారి నీడ కూడా సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటారు. మనువు వీరికి విధించిన కట్టుబాట్లు అన్నీ ఇన్నీ కావు. మాంసాహారం, ఉప్పు, కారం, ఉల్లి, వెల్లుల్లి, వంటి వాటికి దూరంగా చప్పిడి కూడు తినమన్నాడు. అదీ రోజుకు ఒక్క పూటే. నేలమీద నిద్ర. నగల స్థానాన్ని రుద్రాక్షలు ఆక్రమిస్తే...సింధూరం బదులుగా విభూది వచ్చి చేరుతుంది. పూలు, రంగు వస్త్రాలకు ప్రతిగా తెల్ల చీర చుట్టుకోవాల్సిందే. కోరికలు పెంచేటటువంటి వాటన్నిటికీ దూరంగా వుండాలి. ముత్తమ్మీద భర్తను కోల్పోయిన మహిళ అందంగా వుండకూడదన్నది మనువు థియరీ. ఆధునిక మనువులదీ అదే రూటనుకోండి.

దయనీయం...

ఆర్థిక స్తోమత అంతగా లేని వారే కాదు. ధనిక కుటుంబాలకు చెందినవారూ ఇక్కడ కనిపిస్తారు. వాస్తవానికి అగ్ర (బ్రాహ్మణ, వైశ్య) కులాలకు చెందిన వారే అధికం. కింది కులాల మహిళల సంఖ్య నామమాత్రమే (వారిలో పునర్వివాహానికి అభ్యంతరం లేదు). భర్తను మింగిన మృత్యువులుగా దుష్ట శకునంగా చిత్రించి బృందావన్‌లోనో, వారణాసిలోనో విడిచి పెట్టడంతో అయినవారి బాధ్యత తీరిపోతుంది. తిండి తిప్పలు, భద్రత, ఆరోగ్యం దేనికీ చేతిలో పైసా వుండదు. ఆశ్రమాల్లోనో, గుడి మెట్లమీదో, వీధుల్లోనో వుంటూ... భజనలు చేసుకుంటూ, పూల దండలు అల్లుకుంటూ, అగర్బత్తీలు చేసుకుంటూ పదో పరకో సంపాదించుకుంటారు. ఆరు నుంచి ఎనిమిది గంటలసేపు ఆలయాల్లో భజనలు చేస్తే ... గుప్పెడు అన్నం... 4 రూపాయలు చేతిలో పడతాయి. పండుగ వేళ ఓ రూపాయి ఎక్కువగా అందే అవకాశముంటుంది. భజనలు చేసే సత్తువ కూడా లేకపోతే... కూర్చుని బిచ్చమెత్తుకోవాల్సిందే. అదీ సాధ్యం కానప్పుడు తోటి వారే దయతలచి తాము తినేదే పెడుతుంటారు. వయసులో వున్న వారు ఆ పూట తిండి కోసం... లైంగిక వేధింపులనూ భరించాల్సిందే. మంచి నీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలూ కరవే. ఇక

వితంతువులకూ ఒక రోజు

జూన్ 23వ తేదీని ప్రపంచ వితంతువుల రోజుగా ప్రకటించింది ఐక్యరాజ్యసమితి (యు.ఎన్.ఒ). వాస్తవానికి లూంబా ఫౌండేషన్ ఈ రోజును 2005లో ప్రకటించినప్పటికీ. ..యుఎన్ఒ దాన్ని 2010లో గుర్తించి అధికారికంగా ప్రకటిం చింది. పేదరికంలో మగ్గుతున్న, అన్యా యానికి గురౌతున్న వితంతువులు... వారి పిల్లల సమస్యను చర్చనీయాంశం చేయ డానికే ఈ రోజు ఏర్పాటైంది. సరిహద్దులకు అతీతంగా అన్ని దేశాల్లోని వితంతువుల జీవితాల్లోని కనిపించని కల్లోలాన్ని, వినిపించని విషాదాన్ని ప్రపంచం దృష్టికి తేవడం ... కేవలం భర్తను కోల్పోయిన కారణంగా వారు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమస్యలను వెలుగులోకి తేవడం... వాటి పరిష్కార దిశగా కృషి చేయడం ఈ రోజు ఏర్పాటు వెనక వున్న లక్ష్యం.

చూపు మందగించినా, క్షయ వంటి జబ్బులొచ్చినా, ఎముకలు పెళుసుబారి విరిగినా... వైద్యం చేయించే దిక్కే వుండదు. వీరికోసం అంత్యోదయ, స్వాధార్ పథకాలున్నా.. అందరికీ... సక్రమంగా...అందుతున్న దాఖలాలు లేవు. ఒకవేళ అందినా ఏ ఆరు నెలలకోసారో ఆ పైకం చేతిలో పడుతుంటుంది. వీరి పేరు చెప్పుకుని డబ్బు కొట్టేసే రాబందుల్లాంటి దళారులకూ కొదవ లేదక్కడ.

నిస్సహాయంగా.. నిరాధారంగా...ఆశ్రమాల్లో చేరిన వితంతు మహిళలు కాస్త వయసులో వుంటే ఎదురయ్యే సమస్యలు వేరు. ఆశ్రమ నిర్వాహకులు 'ధనిక' యాత్రికులకు 'సేవలు' అందించడానికి పంపిస్తుంటారు. లేకపోతే ఆ ఆశ్రమాల్లో చోటుండదు. తిండి దొరకదు. మహిళలను వ్యభిచార కూపాలకు తోలడం కూడా జరిగిపోతుంటుంది. ఇవన్నీ అధికారులకు, రాజకీయ నాయకులకూ తెలుసు. అయినా అన్నీ నిర్విఘ్నంగా అలా జరిగిపోతుంటాయంతే.

అంత్యక్రియలూ కరవే

జీవితంలో ఆఖరి ఘట్టమైన అంత్యక్రియలు గౌరవప్రదంగా వుండాలని కోరుకుంటారు ఎవరైనా. వీరికి మాత్రం అది తీరని కోరికే. ప్రభుత్వ ఆశ్రమాల్లో నివసించే వితంతువులు చివరి శ్వాస వదిలితే ... శవాలను ముక్కలు ముక్కలుగా నరికి గోనెసంచుల్లో కుక్కి సమీపానున్న నదుల్లో విడిచిపెట్టిన ఘటనలు కూడా వెల్లడైనాయంటే ఆశ్చర్యం వేస్తుంది. తోటి మహిళలు తమ దగ్గర వున్న పదో పరకో ఆశ్రమంలో స్వీపర్లకిస్తేనే ఆ మాత్రపు గౌరవమైనా దక్కుతుంది. లేదా వారిచ్చిన కొద్దిపాటి పైకంతో కొన్న కాసిని కట్టెలతో దహనం కాగా మిగిలిన శరీరాన్ని నదుల్లోకి తోసేస్తుంటారు. ఆఖరికి సుప్రీంకోర్టు రంగప్రవేశం చేసి స్థానిక అధికారులకు మొట్టికాయలు వేయడంతో.. ఎలక్ట్రిక్ క్రిమేషన్ ఏర్పాట్లు చేసేందుకు పూనుకున్నారు.

చట్టాలున్నా...లేనట్టే...

150 సంవత్సరాల కిందటే హిందూ వితంతు పునర్వివాహ చట్టం చేసినా ఆధునిక మనువులు దాన్ని అమలు కానివ్వకుండా మోకాళ్ళ అడ్డుపెడుతుంటారు. పురుషులకు వున్న వారసత్వ హక్కులన్నీ మహిళలకూ వున్నాయని హిందూ వారసత్వ చట్టం చెప్తున్నా అందుకోనివ్వరు. చదువు లేకపోవడంతో ... తమ హక్కుల గురించి తెలిసే అవకాశమే లేదా అసహాయలకు. ఇన్ని చట్టాలున్నా... కొన్ని గ్రామాల్లో ఊరి పెద్దల మాటే అసలు చట్టం. వారు చెప్పిందే వేదం. వీరి ప్రకారం భర్తపోయిన మహిళలకు

ఎలాంటి ఆస్తి హక్కు వుండదు. అమ్ముకోవడానికి లేకపోయినా కనీసం దాని మీద వచ్చే ఆదాయాన్నైనా అనుభవించేందుకు అనుమతించరు. ఒకవేళ ఆమెకు పిల్లలుంటే ...వారి చదువులకు, పెళ్లిళ్లకు అంత ఖర్చు చేశామనీ, ఇంత ఖర్చయిందనీ చెప్పి ఆస్తంతా

- ❑ **దేశంలో మూడు కోట్ల ముప్ఫై లక్షల మంది వితంతు వులు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి.**
- ❑ **వితంతువుల్లో 50 శాతం మంది యాభై ఏళ్లు పైబడిన వారే.**
- ❑ **దేశ జనాభాలో వారి వాటా 11 శాతం వరకు ఉంది.**
- ❑ **ప్రతి నాలుగో ఇంట ఒక వితంతువు ఉన్నారు.**
- ❑ **వారిలో చాలా మంది చిన్న వయసులోనే పెళ్లిళ్లై వితంతువులుగా మారినవారే.**

లాగేసుకున్నా చేసేదేమీ వుండదు.

భరతవాక్యం పలకలేమా!

21వ శతాబ్దంలో వున్నాం. స్వతంత్ర పాలనలో వున్నాం. అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరనున్నాం. ఇంకా ఇలాంటి మూఢ విశ్వాసాల్లో పడి మగ్గిపోతున్నాం. వైధవ్యం ఆ మహిళల అన్ని హక్కులనూ, సంతోషాలనూ ఎందుకు హరిస్తుంది? చావూ బతుకూ కాని విచిత్ర స్థితిలోకి ఎందుకు నెట్టేస్తుంది? అయిన వారందరికీ దూరంగా ఎక్కడో సజీవ శవాల్లా బతకమని ఎందుకు శాసిస్తుంది? అంటే... సమాజంలో వేళ్లూనుకున్న పితృస్వామిక భావజాల ఫలితమే ఇదంతా. ఆర్థిక, సాంఘిక పెత్తనమంతా మగవాడి చేతిలోనే వుండాలి. భర్తపోతే ఆస్తిని భార్యకు కాకుండా అతని తోబుట్టువులే సొంతం చేసుకుంటారు. అందుకు మతాన్ని, అది చెప్పే ఆధ్యాత్మికతను, భక్తిని శక్తిమంతమైన సాధనంగా వాడుకుంటున్నారు. అందులో భాగంగానే ఈ సమాజం భర్త పోయిన మహిళ రూపంలోను, ఆహార్యంలో మాత్రమే మార్పులు చేస్తోంది. అదే భార్య పోయిన భర్తకు ఎలాంటి నిబంధనలూ పెట్టకపోగా... తిరిగి పెళ్లి చేసుకొనే వెసులుబాటు కల్పించేసింది. అతనికో నీతి...ఆమెకో రీతి. ఈ ద్వంద్వనీతిని అందులోని దమన రీతిని అంతం చేయాల్సిన బాధ్యత సమాజంపైనే వుంది. కాశీకి ప్రాతినిధ్యం వహిస్తూ ఈ దేశ సంస్కృతి గురించి రోజూ మాట్లాడే ప్రధాని వంటి వారు అందుకు ప్రత్యేక వ్యవస్థలే ఏర్పాటు చేయడం పెద్ద పని కాదు. కాని మతతత్వ రాజకీయాలు అందుకు ఒప్పుకోవు. సరికదా వితంతువులు మరిన్ని ఆంక్షలతో మగ్గితేనే మోక్షమంటాయి. ఇలాటి తరుణంలో మహిళా చైతన్యం, సమాజ సంస్కారం, మీడియా ప్రచారం ద్వారానైనా పరిస్థితిని మార్చే ప్రయత్నం చాలా అవసరం. లేకపోతే గంగాతీరంలో గంగా భగీరథి సమానులుగా పిలవబడే ఈ వితంతువుల విషాదం అలా సాగుతూనే వుంటుంది. ✦

'వాటర్'లో
లీసారే, జాన్ అబ్రహం

వెండితెరపై విషాదగాథలు

మానవ జీవితంలో ఎన్నో పార్శ్వాలను తెరకెక్కిస్తుంటారు దర్శకనిర్మాతలు. వితంతువుల విషాదమూ వారికి కథా వస్తువైంది. 70, 80లలో కన్నడ, తమిళ భాషల్లో ఈ తరహా చిత్రాలు సంచలనం కలిగించాయి. అవార్డులు కూడా పొందాయి. ఈ అంశంపై చాలా చిత్రాలొచ్చినా వాటిలో కొన్ని సినిమాలను తప్పక ప్రస్తావించుకోవాలి. ధారణ్ మంద్రయార్ 'వైట్ రెయిన్‌బో', దీపా మెహతా 'వాటర్' వితంతువుల గాధలను, వారి వెనకున్న చీకటి కోణాన్ని ప్రపంచం ముందు ఆవిష్కరించారు. సినిమా తీసేటప్పడే కాదు! విడుదలయ్యాక కూడా వివాదాలు, విమర్శలూ వచ్చాయి. 'వాటర్' చిత్రంలో లైంగిక దోపిడీకి గురైన యువ వితంతువు కళ్యాణి జీవితాన్ని, బాల్య వితంతువు చుయియా బాధామయ గాధను సజీవంగా కళ్లకు కట్టింది దీప. భర్తపోయిన భార్యకు బలవంతంగా తెల్లచీర కట్టించినప్పటికీ వారి జీవితాల్లో రంగులు నింపాల్సిన అవసరముందని భావించిన ధారణ్ తన 'వైట్ రెయిన్‌బో' చిత్రాన్ని రూపొందించాడు.



ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ-భాగం -33

మార్క్స్, జెన్నీ, ఎంగెల్స్

చివరికి పదిహేడు నెలల తర్వాత ప్రష్యాలోని కమ్యూనిస్టు లీగ్ సభ్యుల కేసు విచారణకు వచ్చింది. వాళ్లకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన సాక్ష్యాలు హాస్యాస్పదం. అంత మాత్రాన వాళ్లు విడుదలయినట్టు కాదు. వాళ్లకు శిక్ష వెయ్యకపోతే ప్రభుత్వం పరువు పోతుంది. న్యాయమూర్తులు ముద్దాయిలకు వ్యతిరేకంగా వున్నారని మార్క్స్ ఒక నిర్ణయానికి వచ్చేశాడు. న్యాయమూర్తుల్లో ముగ్గురు ఎగువ మధ్య తరగతి వాళ్లు, ఇద్దరు ఉన్నత వర్గం వాళ్లు, ఇద్దరు భూస్వాములు, ఇద్దరు ప్రభుత్వ సలహాదారులు, ఒక ప్రష్యన్ ప్రొఫెసర్ వున్నారు. అనుకూలమైన విషయం ప్రాసిక్యూషన్ సాక్షులిద్దరు అదృశ్యమైపోయారు. ఇందులో ఒకడు పోలీసుల అవినీతిని భరించలేక బ్రెజిల్ పారిపోయాడు.

మార్క్స్ నాయకత్వంలో రాడికల్ జర్మన్ ప్రతిపక్షాలన్ని ఏకమైనాయని ఒక డెబ్బై పేజీల అభియోగం మోపింది ప్రభుత్వం. 1831లో లీగ్‌కు అంకురార్పణ జరిగినప్పటి నుండే దొరికిన సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. ఇందులో కొన్ని నిర్బంధంలో ఉన్నవారి నుంచి సేకరించిన వాంగ్మూలాలు. ఈక్రమంలో చిత్రహింసలకు గురైన పబ్లిషర్ బెకర్ అంధత్వానికి చేరువగా వున్నాడు. మరొకతను డాక్టర్ డేనియల్స్ క్షయవ్యాధితో బాధపడుతున్నాడు. నిర్బంధంలో ఉన్న వారి నుండి సేకరించిన సాక్ష్యాలు వారి ప్రభుత్వ వ్యతిరేక భావాలను తెలియచేస్తాయే తప్ప అవి 'కుట్ర' అని నిరూపించలేవని మార్క్స్ నమ్మకం. అసలు విచారణ జరుగుతున్నది వాళ్ల రాజకీయ అభిప్రాయాల గురించా లేక వారిని ప్రభావితం చేసిన 'వ్యక్తి' మీదా? ప్రమాదకరమైనవి ఆ అభిప్రాయాలా లేక వ్యక్తా? మార్క్స్ బోనులో నిల్చోనప్పటికీ, ప్రాసిక్యూషన్ లక్ష్యం అతడేనన్నది స్పష్టం. గూఢచారి సైబర్ సమర్పించిన పత్రాలను కోర్టు వారు కొంత వరకు నమ్మినా హిర్ష్ (గూఢచారి) సాక్ష్యం పచ్చి బూటకమన్నారు. అతడి పత్రాలన్నీ ఫోర్జరీ అని తేల్చేశారు.

ఈ సాక్ష్యాలు నీరుగారిపోవటంతో నేరం నిరూపించటానికి ఇతర ఆధారాల కోసం వెదికింది ప్రాసిక్యూషన్. సంతకం లేని ప్రచార కరపత్రం ఒకటి మార్క్స్ రాశాడని కోర్టులో ప్రవేశపెట్టారు.'విప్లవం కనుచూపు మేరలో ఉంది, విప్లవం వర్థిల్లాలి...' అని ఉంది అందులో. ఈ కాగితాలను జూన్ 5, 1852 అర్ధరాత్రికి ముందు, విప్లవ సానుభూతిపరుల దృష్టికి తేవాలని కూడా రాశారు. ముద్దాయిలను నిర్బంధించిన తర్వాత విడుదలైన కరపత్రమిది. అంటే ఇది చదివి వాళ్లు కార్యాచరణకు పూనుకోలేదు. ఇదొక్కటే వాళ్లకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టబడిన సాక్ష్యం.

"ఆ తర్వాత రెండు వారాల లోపే లీగ్‌ను రద్దు చేశాడు మార్క్స్. లీగ్‌ను నిర్మూలించటానికి ప్రష్యన్ అధికారులు ఎంతకైనా తెగిస్తారనే నమ్మకం, యూరోప్‌లో అప్పుడున్న రియాక్షనరీ వాతావరణం, ఇప్పటి తీర్పు మార్క్స్ నిర్ణయానికి కారణం. మార్క్స్ ఆలోచనల్ని ప్రభావితం చేసినవి రెండు విషయాలు. ప్రజాస్వామ్య దేశమనుకున్న ఫ్రాన్స్ డిసెంబర్ 2 నాడు సామ్రాజ్యంగా మారిపోయింది. జీవితకాల అధ్యక్షుడిగా ఉన్న లూయి నెపోలియన్, చక్రవర్తి నెపోలియన్ 3గా ప్రకటించుకున్నాడు. ఫ్రాన్సుకు స్వర్ణయుగం తీసుకువస్తానని చెప్పి సమస్త ప్రజానీకాన్ని బురిడీ కొట్టించాడు. ఇంకేం మిగిలిందని? 1815 నుండి 1848 దాకా సాధించిన ప్రజావిజయాలన్నీ ఒక్క ప్రకటనతో తుడిచి పెట్టుకుపోయాయి."

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

ఇది బూటకపు సాక్ష్యమని మార్క్సును ఎరిగిన వాళ్లందరికీ తెలుసు. మార్క్స్ ఇలాంటి పనులు చెయ్యడు. అతడు విప్లవం అనివార్యం కాదన్నందుకే ప్రత్యర్థులు అతని మీద కత్తులు దూశారు. ఈ కరపత్రంతో తనకెటువంటి సంబంధమూ లేదని బ్రిటిష్ మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇచ్చాడు మార్క్స్. ఈ వాంగ్మూలాన్ని కొలోన్‌కు పంపించారు. బ్రిటిష్ పత్రికల్లో కూడా ప్రచురించారు. అయినా ప్రాసిక్యూషన్ తన అభిప్రాయం మార్చుకోలేదు. దస్తూరిని పోల్చి చూడటానికి ఈసారి నిపుణులను అనుమతించలేదు.

నవంబరు 7 నాడు విచారణ ముగిసింది. అభియోగాలు రుజువు కాలేదు, గనుక ముద్దాయిలను విడుదల చేస్తారని బెర్లిన్ పత్రికలు రాశాయి. కాని తీర్పు మరో రకంగా వచ్చింది. డేనియల్స్‌తో సహా నలుగుర్ని విడుదల చేశారు. మిగతా ఏడుగురికి జైలు శిక్ష విధించారు. ముగ్గురికి ఆరేళ్లు, మరో ముగ్గురికి అయిదేళ్లు, ఒకరికి ఒక ఏడాది.

ఆ తర్వాత రెండు వారాల లోపే లీగ్‌ను రద్దు చేశాడు మార్క్స్. లీగ్‌ను నిర్మూలించటానికి ప్రష్యన్ అధికారులు ఎంతకైనా తెగిస్తారనే నమ్మకం, యూరోప్‌లో అప్పుడున్న రియాక్షనరీ వాతావరణం, ఇప్పటి తీర్పు మార్క్స్ నిర్ణయానికి కారణం. మార్క్స్ ఆలోచనల్ని ప్రభావితం చేసినవి రెండు విషయాలు. ప్రజాస్వామ్య దేశమనుకున్న ఫ్రాన్స్ డిసెంబర్ 2 నాడు సామ్రాజ్యంగా మారిపోయింది. జీవితకాల అధ్యక్షుడిగా ఉన్న లూయి నెపోలియన్, చక్రవర్తి నెపోలియన్ 3గా ప్రకటించుకున్నాడు. ఫ్రాన్సుకు స్వర్ణయుగం తీసుకువస్తానని చెప్పి సమస్త ప్రజానీకాన్ని బురిడీ కొట్టించాడు. ఇంకేం మిగిలిందని? 1815 నుండి 1848 దాకా సాధించిన ప్రజావిజయాలన్నీ ఒక్క ప్రకటనతో తుడిచి పెట్టుకుపోయాయి.

“ మార్క్స్ బాల్యం నుండి పిల్లలకు భాషాసాహిత్యాల పట్ల ఆసక్తి కలిగించటానికి ప్రయత్నించాడు. ఇందుకోసం జెన్నీ తండ్రిలాగే, అతడికీ షేక్స్ పియర్ అందివచ్చాడు. తక్షణం వాళ్ల ఇల్లు రంగ స్థలం లా మారిపోతుంది. నాటకాలలోంచి హావభావాలతో చదువుతుంటే ఆ దృశ్యాలు కళ్ల ముందు కదులుతాయి. త్వరలో పిల్లలు కూడా వాటిని కంఠస్థం చేశారు. ఇటాలియన్ మహాకవి (డివైన్ కామెడీ రచయిత) డాంటే, (డాన్ క్విక్సాట్ రచయిత) సెర్వాంటెస్, స్కాటిష్ రచయిత సర్ వాల్టర్ స్కాట్, అమెరికన్ రచయిత జేమ్స్ ఫెనిమోర్ కూపర్స్, ఫ్రెంచి నవలా రచయిత బాల్జాక్‌లను ఆయా భాషల్లోనే చదివి పిల్లలకు వినిపించేవాడు మార్క్స్. ఈ నవలలు, కావ్యాలలోని పాత్రలందరూ వాళ్ల కుటుంబ సభ్యులయ్యారు. ఏనాడూ కడుపు నిండకపోయినా మేధోపరంగా వాళ్లది సంపన్న కుటుంబమే. ”

క్రమంగా, తమ పుస్తకం The Great Men of Exile కు ఏమైందో తెలిసి వచ్చింది. అసలు దాన్ని ప్రచురించటానికి ఎవరూ ఆసక్తి కనబర్చలేదు. ప్రష్యన్ పోలీసులకు ఈ పుస్తకం అవసరమైంది. పనిచేసి పెట్టినందుకు చాంగ్యా నెలకు రెండుసార్లు బెర్లిన్ నుండి పెద్ద మొత్తంలో డబ్బందుకున్నాడు. రాతప్రతి తీసుకుని తక్షణమే మార్క్స్‌కు నగదు చెల్లించడానికి కారణమిదే. పుస్తకం అచ్చు వేస్తే అది పాఠకులతో పాటు పోలీసులకు ఎటూ చేరేదే. కాని ఇప్పుడు పోలీసుల చేతుల్లో మాత్రమే ఉందది. లండన్‌లో ఉన్న శరణార్థుల గురించి అనేక విషయాలు దీని ద్వారా తెలుసుకొని తమ అరెస్టుల పర్వం కొనసాగించారు. రొలాండ్ డేనియల్స్ అరెస్టుకు కారణం మార్క్స్ అని ఆరోపించాడు అతడి సోదరుడు. మార్క్స్ చాంగ్యాతో చేతులు కలపకపోతే ఇంత ఘోరం జరిగుండేది కాదని అతని నమ్మకం. ఈ ఆరోపణ నిరాధారమైనది. మార్క్స్ చాంగ్యాలు కలవడానికి ఏడాది క్రితమే అరెస్టయ్యాడు డేనియల్స్. తన విషయం బహిర్గతం కావటంతో పలాయనం చిత్తగించిన చాంగ్యా పారిస్‌లోని ఫ్రెంచి పోలీస్ మినిస్ట్రీలో స్పెషల్ ఏజెంటుగా ఉద్యోగం సంపాదించాడు.

ఈ లోగా ఒక స్విస్ పబ్లిషర్, మార్క్స్ రాసిన Revelations Concerning the Communist Trial in Cologne చదివి ముగ్ధుడై, తక్షణమే ప్రచురిస్తానన్నాడు. పబ్లిషర్ ఉత్సాహం చూస్తే తమకు కనీసం 30 పౌండ్లు వెంటనే వస్తాయనుకుంది జెన్నీ. అడాల్ఫ్ క్లస్‌కు కూడా ఒక కాపీ పంపిస్తూ, అమెరికాలో ప్రచురించమని సూచించాడు మార్క్స్. కాని మార్క్స్ ఆశించినట్టుగా ఎప్పుడూ జరగదు. పబ్లిషర్ Revelations ను రెండు వేల ప్రతులు ముద్రించి ప్రష్యాలో పంపిణీ చేయటానికి బేడెన్ నగరానికి పంపాడు. కాని అక్కడ ప్రష్యన్ ప్రభుత్వం ఆ ప్రతులను తగులబెట్టించింది.

ఇంతటితో కథ ముగియలేదు. ముద్రణ ఖర్చులకు గాను మార్క్స్ 424 ఫ్రాంకులు చెల్లించాలన్నాడు పబ్లిషింగ్ కంపెనీలోని వాటాదారు. అలా మరోసారి మార్క్స్‌కు డబ్బు వస్తుందనుకున్న చోట అప్పు మిగిలింది.

లండన్ 1853

పోరాటంలో ప్రష్యన్ ప్రభుత్వం పైచేయి సాధించడంతో, ఇక పార్టీ రాజకీయాల నుండి విరమించుకుంటున్నట్టు ప్రకటించాలనుకున్నాడు మార్క్స్. శత్రువులు అతని మీద నీలాపనిందలు వేశారు. మిత్రులనుకున్న వాళ్లు ద్రోహం చేశారు. “పార్టీని అడ్డం పెట్టుకొని నా మీద బురద జల్లాలనుకునే వాళ్లకు ఇక నేను ఆ అవకాశం ఇవ్వదలచుకోలేదు.” అన్నారు. కమ్యూనిస్టు లీగ్‌కు ఇంకా చెయ్యవలిసిన పని ఒకటి మిగిలి ఉంది. ప్రష్యన్ జైళ్లలో మగ్గుతున్న తమ సహచరులకు ఆర్థిక సహాయం కోరుతూ ప్రకటనలు జారీ చేసింది. ఎలాగోలా ఆ పని ముగించి సభ్యులు ఒక్కొక్కరే మార్క్స్ ఇల్లు వదిలి వెళ్లారు. కమిటీ కార్యకలాపాల కోసం చాలా ఖర్చుపెట్టాడు ఎంగెల్స్. “మా నాన్నకు వచ్చిన లాభాల్లో సగం నేనే కాజేశాను.” అన్నాడు. ఇలాగే కొనసాగితే ఆ గుట్టు బయటపడే ప్రమాదముంది.

అడాల్ఫ్ క్లస్

ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని ఎంగెల్స్ ఒక తక్కువ అద్దె ఇంటికి మారాడు. చవకబారు మద్యం సేవించాడు. ఇంగ్లీషు భాషలో తను రాసిన తొలి వ్యాసాన్ని ట్రిబ్యూన్‌కు పంపించాడు మార్క్స్. ఇప్పుడు వ్యాసానికి రెండు పౌండ్లు ఇస్తామని అన్నారు పబ్లిషర్లు. వారానికి రెండు రాయాలనుకున్నాడు మార్క్స్. కనీసం రోజువారీ ఖర్చులకు సరిపోతుంది అనుకుంది జెన్నీ.

1853 నాటికి మార్క్స్ దంపతులు సోహో ప్రాంతానికి వచ్చి, యించుమించు మూడేళ్లైంది. ఇప్పుడది అంత జుగుప్సాకరంగా కనిపించడం లేదు. అక్కడి వాతావరణానికి అలవాటు పడ్డారు. పేదరికం, మురికి, గోల ఇబ్బందికరంగా లేవు. చవకబారు కాఫీ హౌజులలో కూర్చుని మిత్రులతో గడపటం బాగానే వుంది. ఎవరైనా ఉచితంగా టికెట్ ఇస్తే నాటకాలకు వెళ్లి రాగలరు జెన్నీ.

LA VISIONE
Poema di
DANTE
ALIGHIERI
Diuiso
In { INFERNO, PVRGATORIO, & PARADISO.
Di nuouo con ogni diligenza ristampato.
IN VICENZA,
Ad instantia di Francesco Leni
Libraro in Padoua. 1613.

డాంటే రచన

తోచనప్పుడు తిరిగిరావచ్చు. ఆమెకు నాటకాలంటే ఇష్టం. ఒకవైపు కోటీశ్వరులు మరొకవైపు ఆకలికి నకనకలాడుతున్న పేదలతో లండన్ జీవితమే ఒక నాటకంలా ఉన్నది.

సంపన్నుల వినోద కేంద్రం ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్. అలంకరించిన షాపులు, అందమైన గుర్రపు బళ్లు, ఖరీదైన దుస్తుల్లో షాపింగ్ కోసం వచ్చిన మహిళలు దర్శనమిస్తారక్కడ. హే మార్కెట్ కూడా రద్దీగానే ఉంటుంది. కూలీ పనులు చేసుకునే వాళ్లు బుట్టలు నెత్తిన పెట్టుకుని లేదా మెడలో వేళ్లాడేసుకొని పువ్వులు, కూరగాయలు అమ్ముతుంటారు. ఇదిగాక ఐరిష్ వాళ్లుండే మరొక ప్రాంతం ఉంది. అక్కడ భోజనమంటే కప్పు కాఫీ మాత్రమే. చలికి ఎర్రబారిన మొహాలతో నిరుపేద స్త్రీలు కాళ్ళు చేతులూ డ్రెస్సు లోపలికి ముడుచుకొని కూర్చుంటారు. ఎవరైనా వచ్చి వస్తువులు అమ్మాలంటే తప్ప కాళ్లు,చేతులు బయటకు రావు. అమ్మటానికి ఒక్కొక్కరు ఒక్కో పద్ధతి ఎంచుకుంటారు. పాటలాగే వుంటుంది వాళ్లమ్మే వస్తువుల జాబితా చదువుతుంటే. రకరకాల మనుషులు, రకరకాల గొంతులు. సోహోలో నిత్యం కనిపించే జీవన నాటకమది. నిత్య నూతనం. అందులో విషాదమూ ఉంది. ఇంగ్లీషు వాళ్లకు స్వతస్సిద్ధమైన పట్టుదలా ఉంది.

మార్క్స్ పిల్లలకైతే సోహో ఇల్లు లాంటిదే. ఎప్పుడూ అక్కడే ఉంటారు. ఆడపిల్లల్ని సామంతులు వెంట తోడు లేకుండా బైటికి పంపించేవారు కాదు. ఆ సమయంలో అక్కడ అన్ని రకాల మనుషులూ తిరుగుతుంటారు. డీన్ స్ట్రీట్‌లో వున్న సోహో థియేటర్ దొంగలకూ, వేశ్యలకూ కేంద్రం. కాల్డ్‌వెల్ డాన్స్‌హౌజ్ కూడా అలాంటిదే.

జెన్నీ చెన్, లారా యింకా చిన్నపిల్లలు. జెన్నీకి తొమ్మిది, లారాకు ఏడు. బయట తిరగటం ఇష్టపడతారు. జెన్నీచెన్‌వి అన్నీ తండ్రి పోలికలే. అదే నల్ల జుట్టు, నల్ల కళ్ళు, చామన చాయ రంగు. లారా తల్లిలా ఉంటుంది. లారావి చిలిపి కళ్లన్నాడు లీచ్‌క్నెష్ట్. ఆడపిల్లల్ని కాస్త కట్టడి చేసినా, ఎడ్గార్‌ను ఇష్టం వచ్చినట్టు తిరగనిచ్చారు. వీడిని ఇంట్లో "ముష్" అని పిలుస్తారు. వీధిలోని పేద ఐరిష్ పిల్లలతో బాగా దోస్తీ చేశాడు ముష్. మార్క్స్ ఇంట్లో అందరూ జర్మన్ మాట్లాడతారు గాని, పిల్లలు ఇంగ్లీషు సులభంగానే నేర్చుకున్నారు. ముష్ సోహో యాసలో మాట్లాడతాడు. ఒకనాడు డబ్బులు బాకీ ఉన్నందుకు గాను, బ్రెడ్డు సప్లై చేసే బేకర్ ఇక అప్పు ఇవ్వనని, ఇంటికి వచ్చి తండ్రిని పిలవమన్నాడు. గుమ్మంలో నిల్చున్న ఆరేళ్ల ముష్ మేడ మీద ఉన్నాడని చెప్పాడు. ఆ తర్వాత మూడు బ్రెడ్డులు తీసుకొని ఇంట్లోకి పారిపోయాడు. ఈ చిల్లర దొంగతనాలు వీధి పిల్లల సావాసంలో నేర్చుకున్నాడనటానికి సందేహం లేదు. సోహో పిల్లలు నడకతో పాటే దొంగతనాలు కూడా నేర్చుకునే వారు.

అయితే మార్క్స్ పిల్లలు సోహో జనంతో కలిసిపోయే అవకాశాలు తక్కువ. ఎందుకంటే వాళ్ల లోకం వేరు. జర్మన్ శరణార్థులతోనే వాళ్లు ఎక్కువ గడుపుతారు. కార్ల్ బ్లైండ్ సవతి కొడుకు ఫెర్డినాండ్‌తో ముష్‌కు స్నేహం ఎక్కువ. అయితే పిల్లలకు అందరికన్నా బెస్ట్‌ఫ్రెండ్ వాళ్ల తండ్రి. వాళ్లతణ్ణి "మార్క్స్‌పాపా" అనీ ఎక్కువగా "మోహ్ర్" అనీ, "చాలీ" అని పిలుస్తారు. వారంలో మిగతా రోజులు పని చేసుకోనిచ్చినా ఆదివారం మాత్రం వాళ్ల కు కేటాయించాల్సిందే.

వాతావరణం అనుకూలించినప్పుడు, కుటుంబం, ఎవరైనా అతిథి వస్తే అతడితో కలిసి సోహో నుండి హాంప్‌స్టెడ్ హీత్ దాకా పిక్‌నిక్ కోసం నడిచేవాళ్లు. లంచ్ ఒక బుట్టలో పెట్టుకున్న లెంచెన్ వెంట వెళ్లేది. లంచ్ తర్వాత కొందరు పేపర్లు చదువుతారు, కొందరు కునుకుతీస్తారు. మార్క్స్ మాత్రం పిల్లలతో ఆడుకుంటాడు. "ఒకసారి మార్క్స్ పిక్‌నిక్‌లో చెస్ట్‌నట్‌లు రాల్చడానికి ఎంత ప్రయత్నించాడంటే, వారం రోజులు దాకా కుడి చెయ్యి కదల్చలేకపోయాడు." అని గుర్తు చేసుకున్నాడు లీచ్‌క్నెష్ట్. కొన్ని సార్లు మార్క్స్ కోసం వచ్చిన మిత్రులు ఆటల్లో గుర్రాల్లా మారారు. పిల్లలు వాళ్ల మీద స్వారీ చేస్తారు. మరికొన్ని సార్లు గాడిదలెక్కి తిరిగారు. సాయంత్రం సోహోకు తిరుగు ప్రయాణంలో ఎవరైనా గొంతెత్తి పాట పాడతారు. లేదా మార్క్స్ డివైన్ కామెడీలో నుండి చదువుతాడు. లేదా గోతెఫాస్ట్ నాటకంలో మెఫిస్టో పాత్ర అభినయిస్తాడు. ఇవన్నీ కాక మార్క్స్ సొంతంగా అనేక కథలు కల్పించి చెబుతాడు. ఆ కథలు ఎంతకూ తెగవు. ఒక వేళ ఆపినా పిల్లలు ఊరుకోరు. వెంటనే మరో కథ అంటూ గోల చేస్తారు.

> **"1853 నాటికి మార్క్స్ దంపతులు సోహో ప్రాంతానికి వచ్చి, యించుమించు మూడేళ్లైంది. ఇప్పుడది అంత జుగుప్సాకరంగా కనిపించడం లేదు. అక్కడి వాతావరణానికి అలవాటు పడ్డారు. పేదరికం, మురికి, గోల ఇబ్బందికరంగా లేవు. చవకబారు కాఫీ హౌజులలో కూర్చుని మిత్రులతో గడపటం బాగానే వుంది. ఎవరైనా ఉచితంగా టికెట్ ఇస్తే నాటకాలకు వెళ్లి రాగలదు జెన్నీ. తోచనప్పుడు తిరిగిరావచ్చు. ఆమెకు నాటకాలంటే ఇష్టం. ఒకవైపు కోటీశ్వరులు, మరొకవైపు ఆకలికి నకనకలాడుతున్న పేదలతో లండన్ జీవితమే ఒక నాటకంలా ఉన్నది."**

మార్క్స్ బాల్యం నుండి పిల్లలకు భాషాసాహిత్యాల పట్ల ఆసక్తి కలిగించటానికి ప్రయత్నించాడు. ఇందుకోసం జెన్నీ తండ్రిలాగే, అతడికి షేక్స్‌పియర్ అందివచ్చాడు. తక్షణం వాళ్ల ఇల్లు రంగ స్థలంలా మారిపోతుంది. నాటకాలలోంచి హావభావాలతో చదువుతుంటే ఆ దృశ్యాలు కళ్ల ముందు కదులుతాయి. త్వరలో పిల్లలు కూడా వాటిని కంఠస్థం చేశారు. ఇటాలియన్ మహాకవి (డివైన్ కామెడీ రచయిత) డాంటే, (డాన్ క్విక్సాట్ రచయిత) సెర్వాంటెస్, స్కాటిష్ రచయిత సర్ వాల్టర్ స్కాట్, అమెరికన్ రచయిత జేమ్స్ ఫెనిమోర్ కూపర్స్, ఫ్రెంచి నవలా రచయిత బాల్జాక్‌లను ఆయా భాషల్లోనే చదివి పిల్లలకు వినిపించేవాడు మార్క్స్. ఈ నవలలు, కావ్యాలలోని పాత్రలందరూ వాళ్ల కుటుంబ సభ్యులయ్యారు. ఏనాడూ కడుపు నిండకపోయినా మేధోపరంగా వాళ్లది సంపన్న కుటుంబమే.

డీన్ స్ట్రీట్‌లో ఉన్నప్పటి మార్క్స్ కుటుంబాన్ని గురించిన అత్యుత్తమ వృత్తాంతాన్ని అందించింది ఒక ప్రష్యన్ గూఢచారి నివేదిక. అతణ్ణి ఇంట్లోకి ఆహ్వానించి కూర్చోమ్మన్నారట. "మార్క్స్ జీనియస్సేగాని, ఇంట్లో అన్నీ నిండుకున్నాయి. దేశ దిమ్మరి జీవనమది. మార్క్స్ స్నానం చేయడు. తల దువ్వుకోడు. మాసిన దుస్తులు మార్చుకోడు. తాగడం ఇష్టం. ఎప్పుడు పడుకుంటాడో, ఎప్పుడు లేస్తాడో ఆయనకే తెలియదు. మార్క్స్ పిల్లలు ముగ్గురూ నిజంగా ముద్దొస్తారు. అతడు కాస్త ఆడవి మనిషిలాగ కనిపించినా పిల్లల పట్ల అతి సౌమ్యుడు."

సశేషం

▪ ఫోన్: 91776 18708

కొబ్బరి రైస్

కావలసిన పదార్థాలు

కొబ్బరి చిప్పలు–2, బియ్యం–అర కిలో, జీలకర్ర, ఆవాలు–రెండు టీ స్పూన్లు, పచ్చి మిరపకాయలు–6, ఎండు మిర్చి–4, అల్లం ముక్కలు–1టేబుల్ స్పూన్, కరివేపాకు–రెండు రెబ్బలు, వేరుశెనగ గుళ్ళు–1 టేబుల్ స్పూన్, జీడిపప్పు–1 టేబుల్ స్పూన్, నిమ్మకాయ–1, ఉప్పు–తగినంత

తయారు చేసే విధానం

ముందుగా అన్నం వండి పక్కన ఉంచుకోవాలి, తరువాత కొబ్బరి చిప్పలను కోరుకోవాలి. ఆ తర్వాత స్టౌమీద మూకుడు ఉంచి నూనె పోసి కాగిన తర్వాత పచ్చిమిర్చి ముక్కలు అల్లం కరివేపాకు, వేరుశెనగ గుళ్ళు, జీడిపప్పు, ఎండు మిర్చి కలిపి బాగా వేయించుకోవాలి. తర్వాత కోరి ఉంచుకున్న కొబ్బరి తురుము వేసి వేయించుకోవాలి. ఇది కొంచెం వేగిన తర్వాత అన్నం వేసి దానిలో కొంచెం ఉప్పు కలిపి బాగా కలియబెట్టాలి. దించే ముందు నిమ్మకాయ పిండుకుంటే పుల్లపుల్లగా రుచిగా ఉంటుంది.

పాలక్ రైస్

కావలసిన పదార్థాలు: బియ్యం–అర కిలో, పాలకూర కట్టలు–3, పచ్చి మిరపకాయలు–6, డాల్డా–500గ్రా, వెన్న–1 టేబుల్ స్పూన్, నిమ్మకాయ బద్ద–1, జీలకర్ర–అర టీ స్పూన్, ఉప్పు, పసుపు–తగినంత

తయారు చేసే విధానం

ముందుగా అన్నం వండి ఉంచుకోవాలి. తరువాత శుభ్రం చేసిన పాలకూరను చిన్న చిన్న ముక్కల్లా తురిమి దానిలో ఉప్పు, పసుపు వేసి గ్రైండ్ చేసి ఒక ముద్దగా చేయాలి. తరువాత స్టౌవ్ మీద మూకుడు పెట్టి డాల్డా వేసి జీలకర్రను వేయించాలి. అది బాగా వేగాక గ్రైండ్ చేసి ఉంచిన ముద్దను మూకుడులో వేసి వేగనివ్వాలి. వేగేటపుడు వెన్న వెయ్యాలి. కొంచెం వేగాక ముందుగా వండిపెట్టుకున్న అన్నం కూడా వేసి కలపాలి. దింపేటపుడు నిమ్మకాయ పిండాలి. పాలక్‌రైస్ రెడీ.

కొత్తిమీరరైస్

కావలసిన పదార్థాలు: కొత్తిమీర కట్టలు–3, బియ్యం–అర కిలో, జీలకర్ర, ఆవాలు–రెండు టీ స్పూన్స్, పచ్చి మిరపకాయలు–6, అల్లం ముక్కలు–1 టేబుల్ స్పూన్, వేరుసెనగ గుళ్ళు–1 టేబుల్ స్పూన్, జీడిపప్పు–1 టేబుల్ స్పూన్, ఉప్పు–తగినంత

తయారుచేసే విధానం

ముందుగా అన్నం వండి పక్కన ఉంచుకోవాలి. ఆ తరువాత పొయ్యి మీద మూకుడు ఉంచి నూనె కాగిన తర్వాత కొత్తిమీర వేయించి దానిలో జీలకర్ర , ఆవాలు, పచ్చి మిరపకాయ ముక్కలు, అల్లం ముక్కలు, వేరుసెనగ గుళ్ళు, జీడిపప్పు వేసి వేయించుకోవాలి. కొంచెం వేగిన తర్వాత పసుపు, ఉప్పు, వండి పెట్టుకున్న అన్నం వేసి బాగా కలియబెట్టాలి. ఇంకేముంది! కొత్తి మీర రైస్ రెడీ!

ఫ్రైడ్ రైస్

కావలసిన పదార్థాలు: బియ్యం–2 కప్పులు, సోయా చంక్స్–అర కప్పు, తరిగిన బీన్స్, క్యారెట్ ముక్కలు–పావు కప్పు, ఉల్లి కాడలు–2, ఉప్పు–తగినంత, గరం మసాలా–2 చెంచాలు, జీడిపప్పు–కొద్దిగా, నూనె–రెండు చెంచాలు

తయారు చేసే విధానం

బియ్యాన్ని కడిగి అన్నం కాస్త పొడి పొడిగా వండుకోవాలి. సోయా చంక్స్‌ను మూడు నాలుగు నిమిషాలు నాననివ్వాలి. నీళ్ళు వంపేసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడి చేసి బీన్స్ క్యారెట్ వేయించుకోవాలి. మరీ మెత్తగా కాకుండా మగ్గనివ్వాలి. పది నిమిషాలయ్యాక తగినంత ఉప్పు, సోయా చంక్స్ చేర్చాలి. ఐదు నిమిషాలయ్యాక ఉడికించి పెట్టుకున్న అన్నం కలిపి. మసాల చల్లి సన్నని మంటపై ఉంచి బాగా కలిపాలి. అన్నం బాగా వేడిగా అయ్యాక జీడిపప్పు, ఉల్లికాడలతో అలంకరించుకోవాలి. వేడి వేడి ఫ్రైడ్ రైస్ రెడీ.

చుక్కలు కలపండి



ఏవి ఎన్ని?

పిల్లలూ... మీలాగే వీళ్లకూ... సెలవులే. అందుకే సరదాగా పార్కులో ఆడుకుంటున్నారు. అయితే పార్కులో ఎంత మంది పిల్లలు ఆడుకుంటున్నారు? వారి దగ్గర ఎన్ని బంతులున్నాయి? ఎన్ని చెట్లు ఉన్నాయి? మొత్తం సైకిళ్లు ఎన్ని? లెక్కించి మీరే చెప్పాలి.



జవాబు: పిల్లలు5: , బంతులు3: , చెట్లు4: , సైకిళ్లు2:

చిటికెలో నింపాలి

మీకు మ్యాథ్స్ అంటే చాలా ఇష్టం కదూ. అందుకే మీ కోసం ఓ లెక్కల పజిల్ తీసుకొచ్చాం. ఈ చిత్రంలో కొన్ని అంకెలు, గణిత గుర్తులు ఇచ్చాం.వాటి ఆధారంగా బాక్సులోని ఖాళీలను పూరించండి.

6	+		=	14
+		+		+
	+	9	=	16
=		=		=
13	+		=	

ఆ రెండు ఏవి?

ఈచిత్రంలో ఓ విచిత్ర జీవి ఉంది. అందులో మొత్తం రెండు జంతువుల శరీర భాగాలున్నాయి. అవి ఏవో గుర్తించి చెప్పండి.

జవాబు: కంగారు,జింక

తేడాలు గుర్తించండి

రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా వున్నాయి కదా. కానీ ఇందులో 8 తేడాలున్నాయి. గుర్తించండి చూద్దాం.



రంగులేద్దామా!

మీకు చేప అంటే చాలా ఇష్టం కదా. ఈ చిత్రంలోని చేపకు రంగులు వేయండి మరి..





కోతిపాట్లు

కథ

అనగనగా ఒక అడవిలో ఒక తోడేలు ఉండేది. అడవిలోని జంతువులను చంపి తిని ఆకలి తీర్చుకునేది. ఒక్కోసారి మాత్రం ఎంత వెదికినా ఆహారం దొరికేది కాదు. అటువంటప్పుడు అది రాత్రిపూట అందరూ నిద్రపోయే సమయంలో అడవికి దగ్గరలో ఉన్న గ్రామానికి వెళ్లి మేకలను చంపి అడవికి తెచ్చుకుని తింటూ ఉండేది. తోడేలు చేసే పనుల్ని అడవిలో ఉండే ఒక కోతి కుతూహలంగా గమనించింది. ఆ విషయం తెలుసుకున్న తోడేలు చాలా తెలివిగా తాను చేస్తున్న పనుల గురించి కోతికి గొప్పగా చెప్తుండేది. యజమానులకు తెలియకుండా మేకలను ఎలా చంపుతుందో కోతికి వర్ణించి చెప్పేది. ఆ మాటలు విన్న కోతికి తోడేలు ఊరివాళ్ల కళ్లు కప్పి మేకల్ని ఏవిధంగా పట్టుకుంటుందో చూడాలనిపించేది.

ఒకరోజు కోతి 'నువ్వు ఆ గ్రామానికి వెళ్లేటప్పుడు నన్ను కూడా తీసుకెళ్తావా? నీ పనితనం చూడాలని ఉంది అని తోడేలును అడిగింది. తన ముచ్చట తీరబోతున్నందుకు కోతి చాలా మురిసిపోయింది. తమ ఊరిలో అప్పుడప్పుడు మేకలు మాయం అవుతుండడం ఆ ఊరి వారు గమనించారు. ఆ సంగతి ఏంటో తెలుసుకోవాలని కొందరు యువకులు మేకలను కాపలా కాయసాగారు. ఆ విషయం తెలియని తోడేలు కోతితో కలిసి ఆ ఊరిలో ప్రవేశించింది. మేకలను తినడానికి వాటి దగ్గరకు వెళ్లటాన్ని ఆ యువకులు గమనించారు. మేకలు ఎలా మాయమవుతున్నాయో వారికి అర్థమైంది. వెంటనే తోడేలుపై కర్రలతో దాడి చేశారు. పక్కనే ఉన్న కోతిని కూడా కొట్టసాగారు. ఆ దెబ్బలకు తట్టుకోలేక కోతి, 'మీ మేకల్ని తినటానికి వచ్చింది తోడేలు, నేను కాదు కదా! నన్నెందుకు కొడుతున్నారు? వదిలేయండి' అని అడిగింది.

'తోడేలుకు సహాయంగా వచ్చావు. నిన్ను మాత్రం ఎలా విడిచి పెడతాం'! అంటూ కొట్టసాగారు.

ఆ యువకులు తోడేలువైపు తిరగగానే కోతి నెమ్మదిగా అక్కడ నుంచి తప్పించుకొని 'బతుకు జీవుడా' అనుకుంటూ అడవికి చేరుకుంది. ఇంకెప్పుడూ ఇలాంటి బుద్ధి తక్కువ పని చేయకూడదని లెంపలేసుకుంది. అప్పటి నుంచి అటువంటి పనులకు దూరంగా ఉండసాగింది.

నీతి : చెడు చేయకపోయినా చెడు చేసే వారి పక్కన ఉంటే ప్రమాదాలు తప్పవు.

నవ్వుల్ – పువ్వుల్

వందకు పైనే



నాన్న: ఏరా! లెక్కల్లో వందకు పైనే మార్కులు వచ్చాయన్నావు? మరి రెండు మార్కులే వచ్చాయేంట్రా!

చింటు: అవును నాన్నా ! ఆ రెండు మార్కులు ఎక్కడ వేశారో చూడండి. వందకు పైనే కదా!

మంచి స్థితి

శ్యామ్: మా మామయ్య రోజుకి కనీసం 500 మందికి భోజనం పెడుతుంటాడు తెలుసా!

భీమ్: ఓహో, అలాగయితే మీ మామయ్య చాలా మంచి సౌండ్ పార్టీ అన్నమాట.

శ్యామ్: అదేం లేదు. తను హోటల్లో సర్వర్.

రూపాయి

బిచ్చగాడు: బాబు, అన్నం తిని మూడు రోజులైంది. ఒక రూపాయి ఉంటే దానం చెయ్యి బాబు.

జంబులింగం: మూడు రోజుల నుండి తిన్లేదంటున్నావ్.ఒక రూపాయితో ఏమొస్తుంది?

బిచ్చగాడు: బరువు చూసుకుంటానయ్యా, ఎంత తగ్గానో.

పేరు

(ఒకపిల్ల కోడి తల్లికోడితో ఇలా అంటుంది)

పిల్ల కోడి: అమ్మా, మనుషులు పుట్టగానే పేరు పెట్టుకుంటారు కదా, మరి మనకెందుకు పుట్టగానే పేర్లుండవు?



తల్లి కోడి: మనక్కూడా ఉంటాయమ్మా! కాకపోతే మనుషులకు పుట్టగానే ఉంటాయి. మనకు చచ్చిపోయాక ఉంటాయి. చికెన్ టిక్కా, చికెన్ చిల్లీ, చికెన్ తందూరి, చికెన్ మల్లై, చికెన్ కడాయి .....

పిల్లకోడి: ఆ.........!!!

వినాశనం

(ఓ బాస్ తన ఆఫీస్‌లో ఉద్యోగులందరినీ కూర్చోబెట్టి ఇలా బోధిస్తుంటాడు)

బాస్: ఒక రోజు వస్తుంది. ఆ రోజు తినడానికి తిండి దొరకదు. తాగడానికి మంచి నీళ్ళు ఉండవు. పెట్రోల్, డీజిల్, కరెంటు అన్నీ అంతం అవుతాయి.

ఒక ఉద్యోగి: (పైకి లేచి) సార్! ఆ రోజు కూడా ఆఫీసుకి రావాలా సార్!

మంచి భోజనం

హోటల్ యజమాని: నీకందరూ ఇచ్చిన టిప్‌లతో ఏం చేస్తావోయ్? భోజనం చేస్తూ సర్వర్‌ని అడిగాడు.

సర్వర్: మంచి హోటల్ కెళ్ళి భోజనం చేస్తానండి"

యజమాని:....!!!!!!!!!

ఎందుకు చెప్పలా!

విద్యార్థి: నిన్న ప్రమీల క్లాసులో నిద్రపోయింది సార్...

టీచర్: మరి నిన్ననే ఎందుకు చెప్పలేదురా బడవా....

విద్యార్థి: అప్పుడు మీరు కూడా నిద్రపోతున్నారు సార్..!!

పెద్ద అబద్ధం

(గదిలో ఇద్దరు కుర్రాళ్ళు గొడవ పడుతుండగా వాళ్ళ అంకుల్ వచ్చాడు)

అంకుల్: ఎందుకు గొడవ పడుతున్నారు?

మొదటి కుర్రాడు: మాకు వంద రూపాయల నోట్ దొరికింది.ఎవరైతే అతి పెద్ద అబద్ధం అడితే వాళ్ళకి ఇవ్వాలని అనుకున్నాం.

అంకుల్: సిగ్గు లేదు, అబద్ధాల మీద పందాలా? మీ వయసున్నప్పుడు నాకసలు అబద్ధమంటే తెలియదు తెలుసా.

ఇద్దరూ ఏకగ్రీవంగా: ఈ వందనోట్ మీరే తీసుకోండి అంకుల్.

బుల్లి బకాసురులు

పిల్లలతో రమేష్ బాయ్, ప్రజ్ఞా బెన్

బొద్దుగా ముద్దుగా వున్న పిల్లలను చూసుకుని తెగ మురిసిపోతుంటారు తల్లిదండ్రులు. గుజరాత్‌కు చెందిన రమేష్‌భాయ్ నంద్వానా, ప్రజ్ఞా బెన్ మాత్రం భయపడిపోతున్నారు. ఫొటోల్లో కనిపిస్తున్న యోగిత (5 సం॥), అనీష (3 సం॥), హర్ష (18 నెలలు) వాళ్ల పిల్లలే. పుట్టినప్పుడు మామూలుగా అందరి పిల్లల్లాగే సాధారణ బరువుతో వున్నా... ఏడాది నిండేసరికి 'బొద్దు' దశను దాటుకొని 'భారీ' స్టేజికి చేరుకున్నారు. ప్రస్తుతానికి యోగిత 48 కేజీలు, అనీష 35 కేజీలు, హర్ష 15 కేజీల బరువున్నారు.

ఇంత లావు కావడానికి... వారి ఆహారపు అలవాట్లు...అందుకు కారణమైన అరుదైన ఆరోగ్య సమస్య. వీరు తెల్లారి లేచింది మొదలు తింటూనే వుంటారు. ఎప్పుడూ ఏదో ఒకటి పెట్టమని అడుగుతూనే వుంటారు. అంత ఆకలి వుంటుందా చిన్నారుల్లో. చేతిలో తినడానికి ఏదీ లేదూ అంటే గోలగోలగా ఏడ్చేస్తారు. దాంతో ప్రజ్ఞాబెన్‌కు ఎప్పుడూ వంట చేయడంతోనే సరిపోతుంది. ఉదయాన్నే లేవగానే 30 చపాతీలు, కేజీ కూర వండుతుంది. అలా మొదలైన వంట...పిల్లలు నిద్రపోయే వరకు సాగుతూనే వుంటుంది. యోగిత, అనీష కలిసి రోజుకు 18 చపాతీలు, 3 గిన్నెల అన్నం, రెండు గిన్నెల కూర, ఆరు ప్యాకెట్ల చిప్స్, ఐదు ప్యాకెట్ల బిస్కెట్లు, 12 అరటిపళ్లు, లీటరు పాలు లాగించేస్తారు. కూలి పనులు చేసుకునే రమేష్‌భాయ్ నెలకు మూడు వేల రూపాయలు సంపాదిస్తాడు. ఆ డబ్బుతో పిల్లల ఆకలి తీర్చలేక అతను పడే అవస్తలు అన్నీ ఇన్నీ కావు. చేతిలో డబ్బు లేకపోతే బంధుమిత్రుల దగ్గర చెయ్యి చాచాల్సిందే.



అమితమైన బరువు వల్ల పిల్లలు నడవలేరు. కదల్లేరు. సొంతగా ఏ పనీ చేయలేరు. అలా కింద పడి దొర్లుతుంటారు. వారికి స్నానం చేయించడం... బాత్‌రూమ్‌కి తీసుకెళ్లడం   ప్రజ్ఞా బెన్‌కు పెద్ద సమస్య. భర్త పనిలో వున్నప్పుడైతే మరీను. తమ చిన్నారులు కూడా అందరి పిల్లల్లా వీరు కూడా చదువుకోవాలని, ఆడుకోవాలని ఆ బీద తల్లిదండ్రుల కోరిక. అందుకు తన కిడ్నీ అమ్మడానికి కూడా సిద్ధమేనంటాడు రమేష్. ఎలాగైనా వారిని మంచి ఆస్పత్రిలో చూపించి చికిత్స చేయించాలని, వారిని మామూలు పిల్లల్లా చూడాలని వారి తపన. కాకపోతే అందుకు పేదరికమే పెద్ద ఆటంకం.

●

వావ్..హెల్మెట్...

వాహన చోదకులు తప్పనిసరిగా భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలి. మరీ ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించకుండా వీధుల్లోకి అడుగెట్టకూడదు. మనకు మనం విధించుకున్న నిబంధన మరి. ఎన్ని నిబంధనలున్నా గాలికి వదిలేసేవారూ వుంటారు. అయితే పోలీసులు జరిమానా విధిస్తారన్న భయంతో మాత్రమే హెల్మెట్లు పెట్టుకునేవారి సంఖ్యా తక్కువేం కాదు. మరి క్రాఫు చెరిగిపోతుందని, జుత్తు అణిగిపోతుందని, అందం తరిగిపోతుందని... ఎవరి కారణాలు వారివి. ఇక మీదట కుర్రకారు ఇలాంటి కుంటి సాకులు చెప్పలేరేమో! అవి హెల్మెట్లేనా అనిపించేంత చిత్రవిచిత్రమైన ఆకృతుల్లో...రూపాల్లో... సొబగులు అద్దుకున్న శిరస్త్రాణాలు మార్కెట్లోకి వచ్చేశాయి. రత్నాల్లాంటి రాళ్లను పొదిగిన హెల్మెట్, పుర్రె హెల్మెట్, జీన్స్ బట్టతో తయారు చేసిన హెల్మెట్, రాజుల కాలంలో సైన్యం వాడిన హెల్మెట్, శాంతాక్లజ్ హెల్మెట్... ఇలా ఎన్ని రకాలో. ఇప్పటిదాకా హెల్మెట్ మాట ఎత్తితేనే చిర్రుబుర్రులాడిన కుర్రకారును సైతం కట్టిపడేస్తాయేమో!